నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

వరంగల్

శనివారం | మార్చి 29, 2025 | www.navatelangana.com

అభివృద్ధి పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- 37వ డివిజన్ కార్పొరేటర్ బోగి సువర్ణ సురేష్



నవతెలంగాణ-కాశిబుగ్గ

ఖిలా వరంగల్ తూర్పు కోటలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని 37వ డివిజన్ కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ అన్నారు. శుక్రవారం స్మార్ట్ సిటీ నిధులు రూ.25లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి కార్పొరేటర్ భోగి సువర్ణ సురేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 37వ డివిజన్ పరిధిలో ప్రస్తుతం రూ.రెండు కోట్ల 50 లక్షల స్మార్ట్ సిటీ నిధులతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నాయని రాబోయే కాలంలో మంత్రి కొండ సురేఖ సహకారంతో మరో రూ.2 కోట్ల జనరల్ ఫండ్, సీడీఎఫ్ నిధులతో మరిన్ని అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు బోయిని దూడయ్య నాయకులు బేడద వీరన్న, సంగారబోయిన చందర్, రఘు, ప్రవీణ్, కుమార్, నరేష్, షబ్బీర్, బోల్లా, ఐలయ్య, రాజు, దేవేందర్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉగాది కానుకగా సన్నబియ్యం పంపిణీ..

- ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరిన సన్నబియ్యం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి:

రాష్ట్ర ప్రభుత్వం ఉగాది కానుకగా రేషన్‌కార్డుదారులకు ఇక నుండి సన్నబియ్యం పంపిణీ చేయడానికి రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా పౌర సరఫరా అధికారులు తగు ఏర్పాట్లు చేశారు. ఎంఎల్ఎస్ పాయింట్లకు సన్నబియ్యం చేరింది. డీలర్లు వారి కోటాను తీసుకుపోవడం కూడా ప్రారంభమైంది. గత ప్రభుత్వం రేషన్‌షాపులు, హాస్టళ్లలో సన్నబియ్యం పంపిణీ చేశామని ప్రచారం చేసినా ఆచరణలో అమలు చేయలేదు. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేసిన ప్రకటనలో భాగంగా ఇప్పటికే అన్ని జిల్లాల్లో సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశారు. గతంలో దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారు. సన్నబియ్యం పంపిణీకి అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేయడం పట్ల పేదల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఇప్పటికే 9,052.189 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం పంపిణీకి సిద్ధంగా వుంది. ఈ రెండు జిల్లాల్లో 4 లక్షల 94 వేల 596 రేషన్‌కార్డులున్నాయి. ఈ రెండు జిల్లాల్లో 923 రేషన్‌షాపులున్నాయి.



- **హన్మకొండలో 4,307.648 మెట్రిక్ టన్నులు**

హన్మకొండ జిల్లాలో 414 రేషన్‌షాపులున్నాయి. 2 లక్షల 28 వేల 167 రేషన్‌కార్డులున్నాయి. వీరందరికి ఒక్కో కుటుంబసభ్యుడికి 6 కిలోల చొప్పున ప్రతినెలా 4,307.648 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశారు. జిల్లాలో రెండు ఎంఎల్ఎస్ పాయింట్లున్నాయి. ఈ పాయింట్లకు ఇప్పటికే సన్నబియ్యం చేరుకోగా డీలర్లు సన్నబియ్యం తీసుకువెళ్లడం కూడా ప్రారంభమైంది. ఏప్రిల్ 1వ తేదీ నుండి సన్నబియ్యాన్ని రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయనున్నారు.

ఏప్రిల్ 1వ తేదీ నుండి పంపిణీ



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలకనుగుణంగా జిల్లాలో ఈనెల 1వ తేదీ నుండి ఉగాది కానుకగా సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లాకు ఇప్పటికే రేషన్‌కార్డుదారులకు 5,014.541 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరుకుంది. డీలర్లు సైతం సరుకు తీసుకువెళ్లి పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

-కిష్టయ్య, డీసీఎస్‌వో వరంగల్

- **వరంగల్ జిల్లాలో 5,014.541 మెట్రిక్ టన్నులు**

వరంగల్ జిల్లాలో 509 రేషన్‌షాపులున్నాయి. ఇందులో 2 లక్షల 66 వేల 429 రేషన్‌కార్డులున్నాయి. వీరికి సన్నబియ్యం పంపిణీ చేయడానికి జిల్లాలోని 3 ఎంఎల్ఎస్ పాయింట్లకు 5,014.541 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం చేరింది.

నగరంలో అంతర్గత రోడ్లు అస్తవ్యస్తం..!

- ఏళ్లు గడిచినా పూర్తి కాని రోడ్ల నిర్మాణ పనులు
- క్షేత్ర స్థాయిలో అధికారులు ఉండటం లేదని ఆరోపణలు
- పనులలో లోపించిన నాణ్యతా ప్రమాణాలు

నవతెలంగాణ-వరంగల్

నగరంలో అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా మారాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 66 డివిజన్లలో సుమారు 12 లక్షల జనాభా ఉన్నది. పట్టణం విస్తృతం అవడంతో నగరంలో చాలా కాలనీలు నూతనంగా ఏర్పాటవుతున్నాయి. సీసీ రోడ్లు వేయడానికి టెండర్లు పిలిచి నప్పటికీ పనులు మాత్రం సాగడం లేదు. కొన్ని కాలనీలలో అంతర్గత రోడ్లు మట్టి రోడ్లతో దర్శనమిస్తున్నాయి. పలు కాలనీలు సీసీ రోడ్లు లేక పోయేసరికి వర్షాకా లంలో మట్టి రోడ్లలో ఏర్పడిన గుంతలలో వర్షం నీరు చేరి ద్విచక్ర వాహనదారు లు, కాలి నడకన వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేసినప్పటికి బుట్ట దాఖలవుతున్నాయి తప్పా సీసీ రోడ్ల పనులు మాత్రం జరుగడం లేదని పలు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఇటీవల వేసిన రోడ్లకు నాణ్యత ప్రమాణాలు పాటించక పోయే సారికి మూడు నాళ్ళకే రోడ్లు నెర్రలు బారుతున్నాయని, పనులు జరిగేటప్పుడు బల్దియా ఇంజనీరింగ్ అధికారులు కనీసం కన్నెత్తి చూడలేని దుస్థితి నెలకొంది. 16వ డివిజన్ లో హౌసింగ్ బోర్డు హెచ్ఐజీలో సీసీ రోడ్ వేయడంతో గతంలో వేసిన రోడ్ కంటే ఎత్తుగా ఉండటంతో వాహన దారులు ప్రమాదాల బారిన పడిన పరిస్థితి నెలకొని ఉంది. అదేవిధంగా లేబర్ కాలనీ వంద ఫీట్ల రోడ్డు నుంచి బాలాజీ నగర్ వరకు మీడియన్స్ ప్రాంతంలో పెద్ద పైపులు పెట్టడం వల్ల అనేక మంది ప్రమాదాలకు గురై తనువులు చాలిస్తున్నావారు లేక పోలేదు. కొన్ని రోడ్లు వేసినా కొన్ని ఏళ్లకే పూర్తిగా దెబ్బ తింటున్న పరిస్థితులు ఉన్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నగరం విస్తరిస్తున్నా పాత, కొత్త అన్న తేడా లేకుండా కొన్ని కాలనీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. సరైన రోడ్లు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షాకాలంలో రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి వాహన దారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎంజీఎం నుండి



వెంకట్రామ థియేటర్ వరకు ప్రధాన రహదారుల నిర్మాణ పనులు అస్తవ్యస్తంగా, అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఒక రోడ్డుపై మరొక రోడ్డు వేయడంతో ఎక్కువ తక్కువలు ఉండడంతో రోడ్డును గమనించక పోతే ప్రమాదాల బారిన పడుతున్న వారు లేకపోలేదు. ఎన్‌పీఆర్‌నగర్, ఎల్‌బీ నగర్, కారల్ మార్క్సనగర్, 29వ డివిజన్ రామన్న పేట, పాపయ్య పేటచమన్, అదేవిధంగా 13వ డివిజన్ ఎంహెచ్ నగర్, 14వ డివిజన్ శ్రీనివాస్ కాలనీ, మణికంఠ కాలని, 16వ డివిజన్ పరిమళ కాలనీ, ఖిలా వరంగల్, హసన్ పర్తి, బృందావన్ కాలని, వంటి రోడ్ల పనులు ముందుకు వెళ్ళటం లేదని పలువురు చర్చించుకుంటున్నారు. ఇది ఇలా ఉంటే గ్రేటర్ పరిధిలో ఇంజనీరింగ్‌అధికారులు చాలా తక్కువగా ఉండటంతో ఒక్కొక్క అధికారికి నాలుగు నుంచి ఆరు డివిజన్లను కేటాయించడంతో క్షేత్రస్థాయిలో ఇంజనీరింగ్ అధికారి పర్యవేక్షణ కరువైందని పలువురు విమర్శిస్తున్నారు. విలీన గ్రామాల్లోనీ కీర్తి నగర్, గొర్రెకుంట వంటి పలు రకాల కాలనీలలో కరెంటు స్తంభాలు తీయకుండానే ప్రధాన రహదారుల్లో సీసీ రోడ్లు వేశారు. ఏళ్లు గడిచినప్పటికి రోడ్ల మధ్యలో ఉన్న కరెంట్ స్థంబాలను తీయక పోవడంతో ప్రమదాలు తరుచుగా జరుగుచున్నాయి. కొత్తగా ఏర్పాటైన కాలనీల్లో రోడ్లు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. గ్రేటర్ వరంగల్‌లో ఎక్కడ చూసినా రోడ్లు సక్రమంగా లేక పోవడంతో వర్షం పడితే చాలు వరద నీరు ఇండ్లలోకి వస్తుందని, రోడ్లపై వెళ్లలేక వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

రహదారుల నిర్మాణం పనులు అస్తవ్యస్థం



ఏదైనా కారణాలతో ప్రధాన రహదారులను తవ్వుతున్నారు. కాని రోడ్ల ప్యాచ్‌లను చేసే క్రమంలో పనులు పూర్తిగా అలసత్వం వహిస్తున్నారు. ఇన్నర్‌రింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. క్రిస్టియన్ కాలనీలో ప్రధాన రహదారి వద్ద సీసీ రోడ్డు నిర్మాణం పేరుతో పది రోజుల క్రితం రొడ్డును తవ్వారు. ఇప్పటి వరకు పూర్తి కాక పోయే సరికి వాహన దారులు తీవ్ర ఇబ్బం దులుఎదుర్కొంటున్నారు.

-అరూరి కుమార్, కేవీపీఎస్ నాయకులు

అంతర్గత రోడ్లు వేయాలి



పలు కాలనీలలో రోడ్లు వేయాలని అనేకసార్లు మున్సిపల్ అధికారులకు వినతి పత్రాలు ఇచ్చినా ఏళ్లుగా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. అధికారులు, ప్రజా ప్రతినిధులు మారుతున్నా అంతర్గత రోడ్ల సమస్య మాత్రం అలాగే ఉంటోంది. ఇప్పటికైనా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు

-బషీర్, సీపీఐ (ఎం) కాశీబుగ్గ కార్యదర్శి

సీసీ రోడ్లు పనులు త్వరగా పూర్తి చేయాలి



గ్రేటర్ వరంగల్ లోని పలు కాలనీలలో రోడ్లు నిర్మాణ పనులు జరిగేటప్పుడు క్షేత్ర స్థాయిలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఉండి నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్నారా. లేదా పరిశీలించాల్సిన అవసరం ఉంది. కాని మున్సిపల్ అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదు. క్షేత్రస్థాయిలో మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు ఉండి నాణ్యత ప్రమాణాలు పాటించితేనే రోడ్లు కొన్నేండ్ల వరకు ఉంటాయి.

-వీరస్వామి, రామన్నపేట

ఎమ్మెల్యే 'దొంతి'కి మంత్రి పదవీ ఇవ్వాలి

- అధిష్టానం సీనియారిటీని గుర్తించాలని విజ్ఞప్తి
- టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్

నవతెలంగాణ-నర్సంపేట



నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కి మంత్రి పదవీ ఇవ్వాలని టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ కోరారు. శుక్రవారం పార్టీ కార్యాల యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రామానంద్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మరో ఆరు మంత్రి పదవులను భర్తీ చేసే ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సీనియర్ నాయకులు రాజకీయ నిబద్ధతకు నిదర్శనమైన దొంతి మాధవరెడ్డికి మంత్రి పదవీ కేటాయించాల్సి అవసరం ఉందన్నారు. శుక్రవారం టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ మాట్లాడుతూ 40 ఏళ్ల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో ఎన్నో వ్యయ ప్రయాసాలు, ఒడిదుడుకులను అనుభవిస్తూ నర్సంపేట గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలన్నారు. నర్సంపేట నియోజకవర్గం చెన్నారావుపేట మండలం అమీనాబాద్ గ్రామ సర్పంచ్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి సొసైటీ చైర్మన్‌గా డీసీసీబీ చైర్మన్‌గా, ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పనిచేసి పీసీసీ , ఏఐసీసీ సభ్యులుగా పదవులు చేపట్టి నిబద్ధత, క్రమశిక్షణ, అంకితభావం కలిగిన ఎదుగుదల కోసం జీవితాన్ని దార పోశారని తెలిపారు. 2004 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ టీఆర్ఎస్‌తో నర్సంపేట టికెట్ టీఆర్ఎస్ అభ్యర్థి కంభంపాటి లక్ష్మారెడ్డికి టికెట్ కేటాయించినా కలత చెందలేదన్నారు. లక్ష్మారెడ్డి గెలుపులో కీలక పాత్ర పోషించాడన్నారు. 2009లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి కొద్దిపాటి తేడాతో ఓటమి చెందినప్పటికీ కాంగ్రెస్ అభివృద్ధి కోసం పనిచేస్తూ వచ్చారన్నారు. కొందరు కాంగ్రెస్ పెద్దలు 2014 ఎన్నికల్లో దొంతి మాధవరెడ్డి టికెట్ కేటాయించకుండా మోసం చేసినా కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజల బలమైన కోరికతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి గెలిచారని గుర్తు చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేలు నీతిమాలిన రాజకీయాలు చేస్తూ పదవుల కోసం జంపు జిలానిలుగా మారి టీఆర్ఎస్ లోకి వెళ్లారని తెలిపారు. నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని టీఆర్ఎస్ లోకి ఆహ్వానించినప్పటికీ మంత్రి పదవీ ఇస్తామని, కోట్ల విలువైన కాంట్రాక్టులు ఇస్తామని నమ్మబలికినా ఆశపడకుండా కాంగ్రెస్‌ను వీడకుండా పార్టీపై ప్రేమతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో ఢిల్లీలో చేరి తన రాజకీయ నిబద్ధతను చాటుకున్నారన్నారు. 2014 నుండి 2018 వరకు ఎమ్మెల్యేగా నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి కష్టపడి పని చేస్తూ అప్పటి అధికార పార్టీ ఎన్ని రకాలుగా ఇబ్బందులకు గురి చేసినా నిక్కచ్చిగా ఎదుర్కొంటూ కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడినాడన్నారు. నర్సంపేట నియోజకవర్గం ఏర్పడి 45 ఏళ్ల చరిత్రలో చేతి గుర్తుపై గెలిచిన దాఖలాలు లేకపోగా మొదటిసారి నర్సంపేట గడ్డపై కాంగ్రెస్ చేతి గుర్తుపై గెలిచి చరిత్ర తిరిగరాశాడన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ అధిష్టానం పార్టీలు ఫిరాయింపులు చేసిన వారికి కొత్తగా వివిధ పార్టీల నుండి పదవుల కోసం పార్టీలోకి వచ్చిన వారికి మంత్రి పదవులను ఇచ్చారని, వరంగల్ ఉమ్మడి జిల్లా సీనియర్ నాయకుడిగా ఉండి కాంగ్రెస్ కోసం ఎన్నో త్యాగాలు చేసినా నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గుర్తించి మంత్రి పదవి ఇవ్వకుండా వరంగల్ ఉమ్మడి జిల్లా అదేవిధంగా నర్సంపేట నియోజకవర్గ కాంగ్రెస్ క్యాడర్‌ను నిరాశకు గురి చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అధిష్టానం గుర్తించి భర్తీ చేయనున్న మంత్రి పదవీని ఇవ్వాలని, ఇందుకోసం రేవంత్ రెడ్డి, రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌లు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో వరంగల్ జిల్లా ఓబీసీ అధ్యక్షులు ఓర్సు తిరుపతి, నర్సంపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపెల్లి సందీప్, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షులు భూసాని సుదర్శన్, బీరం భరత్‌రెడ్డి, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి చిప్ప నాగ, నర్సంపేట పట్టణ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శి జన్ను మురళి, నర్సంపేట నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ములుకల మనీష్, పున్నం రాజు, భూక్య గణేష్, కొత్తగట్టు ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవీకి ఎమ్మెల్యే దొంతి అర్హతలో ప్రథముడు

ఎమ్మెల్యే దొంతిని మంత్రి పదవితో గౌరవించాలి

పీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి

నవతెలంగాణ-నెక్కొండ



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంలో వరంగల్ జిల్లా సీనియర్ నాయకుడు, రాజకీయ నిబద్ధతకు నిదర్శనమైన వ్యక్తి, మంత్రి పదవీకి అర్హతలో ప్రథముడైన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి మంత్రి పదవీ ఇచ్చి గౌరవించాలని టీపీసీసీ సభ్యులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఖాళీగా వున్న మంత్రి పదవులను భర్తీ చేస్తున్న నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో సీనియర్ నాయకునికి మొదటగా ప్రాధాన్యత నివ్వాలన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం దొంతి మాధవరెడ్డి 40 ఏళ్లుగా చేసిన త్యాగాన్ని హైకమాండ్ గుర్తించి మంత్రి పదవీని కట్టబెట్టాలన్నారు. నర్సంపేట నియోజక వర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అమీనాబాద్ గ్రామ సర్పంచ్‌గా తన రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి సొసైటీ చైర్మన్‌గా, డీసీసీబీ చైర్మన్‌గా, ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా, ఏఐసీసీ సభ్యులుగా పదవులు చేపట్టి క్రమశిక్షణ కాంగ్రెస్ పార్టీ ఎదుగుదల కోసం అహర్నిశలు కష్టపడిన సీనియర్ నాయకుడిని హైకమాండ్ గుర్తించాలన్నారు. ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, తెలంగాణ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌లను కోరారు.

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం


నవతెలంగాణ-పర్వతగిరి



పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ జమాల్ పురం గ్రామశాఖ అధ్యక్షులు జున్ను కనకయ్య యాదవ్ అన్నారు. పర్వతగిరి మండలంలో పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేయబడిన జమాల్ పురం గ్రామంలో ల్యాదెల్ల హేమంత్ ఇంటికి టార్గెట్ పూర్తి చేయడంలో భాగంగా శుక్రవారం ఆయన ముగ్గు పోసి భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని చెప్పారు. ఈకార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు, బాల్లె మల్లేశం, గోదారి నరేష్, భైరబోయిన సదయ్య, కారింగుల కిషన్, కార్యదర్శి దివ్య, అడ్డూరి సోమయ్య, బండి సారయ్య, గూడూరు సారంగపాణి, పిడుగు ఎల్లయ్య, పిడుగు రమేష్, కొల్లూరి సమ్మయ్య, ల్యాదెల్ల సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎంసీ మార్కెట్ మాజీ చైర్మన్‌కు మార్నేని పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి



మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన వరంగల్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ తక్కలపల్లి నారాయణరావు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు తక్కలపల్లి భాస్కర్ రావుల తల్లి సుభద్ర దేవి అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా తెలంగాణ రాష్ట్ర కో- ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ఎంసీ మాజీ డైరెక్టర్ యుగంధర్‌రావు, బీఆర్ఎస్ పర్వత గిరి మండల అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-నెక్కొండ



నెక్కొండ మండలం దీక్షకుంటకు చెందిన యువకుడు క్షణికావేశంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు నెక్కొండ ఎస్సై మహేందర్ తెలిపారు. మండలంలోని దీక్షకుంట గ్రామానికి చెందిన ముడుసు సాయి (28) ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. అదే గ్రామంలోని అమ్మాయిని ఇష్టపడగా, ఇరువురు పెద్దలు పెళ్లికి అంగీకరించి మూడు నెలల తర్వాత పెళ్లి చేస్తామని చెప్పగా మృతుడు తన పెళ్లి ఆలస్యమవుతుందని మనస్థాపం చెంది క్షణికావేశంలో శుక్రవారం తెల్లవారుజామున రెండున్నర గంటలకు ఇంట్లో చీరతో ఉరి పెట్టుకున్నట్లు తండ్రి నరసింహస్వామి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. వెంటనే తల్లిదండ్రులు నర్సంపేట ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడన్నారు. మృతుని తండ్రి నరసింహస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



వరద నివారణకు రూ.50 లక్షలు మంజూరు

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు కృతజ్ఞతలు

నవతెలంగాణ-కాశిబుగ్గ

గ్రేటర్ వరంగల్ 14వ డివిజన్ ఎస్సార్ నగర్‌లో వరద ముంపు నివారణకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రూ. 50లక్షల నిధులను మంజూరు చేసినట్లు కాంగ్రెస్ పార్టీ ఎస్సార్ నగర్ శాఖ అధ్యక్షుడు మచ్చర్ల స్టాలిన్ తెలిపారు. ఈమేరకు శుక్రవారం కాలనీవాసులతో కలిసి స్టాలిన్ ఎమ్మెల్యే నాగరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ఎస్సార్‌నగర్‌లో అనేక సంవత్సరాలుగా సరైన డ్రైనేజీ లేకపోవడంతో వర్షాకాలంలో లేబర్ కాలనీ, కట్టమల్లన్న చెరువు వద్ద నుండి వస్తున్న వరద నీరు ఎస్సార్ నగర్ లోని ఇళ్లలోకి రావడం వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇట్టి సమస్యను గత ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళ్లినా ఇలాంటి ప్రయోజనం లేదన్నారు. దీంతో ఇట్టి సమస్యను స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్ సహకారంతో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నాగరాజు ఎస్సార్ నగర్ లో శాశ్వత ప్రతిపాదికన వరద ముప్పు నివారణకు సైడ్ డ్రైనేజ్ నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగరాజుకు కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్యకు, డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్‌కు కాలనీవాసుల పక్షాన స్టాలిన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

లక్ష్య చేధనకు ఆయుధంగా కృషి పట్టుదల

- గట్ల సురేందర్ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్

నవతెలంగాణ-ఖానాపురం

జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఛేదించేందుకు ఆయుధంగా కృషి పట్టుదల ఉంటే దేన్నయినా సాధించవచ్చునని సైనిక్ స్కూల్ ప్రిన్సిపల్ గట్ల సురేందర్ అన్నారు. ఈసందర్భంగా వారు సైనిక్ స్కూల్‌లో డిగ్రీ చదువుతున్న 8 మంది విద్యార్థులు ఏకకాలంలో అగ్ని వీర్‌కి ఎంపిక కాబడ్డారని, భారత దేశ రక్షణ దళంలోకి ప్రవేశం పొందే అర్హత సాధించినట్లు వారు శుక్రవారం తెలిపారు. విద్యార్థులు గట్టి పట్టుదలతో ఎంతో శ్రమపడి లక్ష్యాలను చేధిస్తున్నట్లు వారు వెల్లడించారు. విద్యార్థులు లక్ష్య చేధనలో ఎన్నో అవకతవకలు వస్తాయని వాటన్నింటిని అధిగమించి ముందుకు సాగాలని తెలిపారు. 8 మంది భారతదేశ రక్షణ దళంలోకి ప్రవేశ అర్హత పొందడంతో పాఠశాల యాజమాన్యాన్ని పలువురు అభినందించినట్లు తెలిపారు. ఎంపిక కాబడిన విద్యార్థులను పాఠశాల యజమాన్యం అభినందించారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ పాఠశాలకు గొప్ప పేరు తీసుకురావాలని సూచించినట్లు వారు తెలిపారు.

వైభవోపేతంగా బద్ది పోచమ్మ జాతర

నవతెలంగాణ-నల్లబెల్లి



శివసత్తుల పూనకాలతో శ్రీ బద్ది పోచమ్మ జాతర హోరెత్తింది గడపగడప నుండి నెత్తిన బోనంతో అమ్మవారికి నైవేద్యాలు, కల్లుశాఖ సమర్పించారు. మండలంలోని బోలోనిపల్లి గ్రామ శివారు పోచంపల్లి గ్రామంలో రెండు సంవత్సరాలకు ఒకసారి ఎంతో వైభవోపేతంగా శ్రీ బద్దిపోచమ్మ జాతర నిర్వహించడం జరుగుతుందని పూజారి కోన స్వామి అన్నారు. బోలోనిపల్లి చుట్టుపక్కల గ్రామంలోని ప్రతి ఇంటి నుండి అమ్మవారికి ధూప, దీప నైవేద్యాలతో బోనమెత్తి కల్లుశాఖ ఆరగించి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. అమ్మవారిని మొక్కుకుంటే కోరికలు నెరవేరుతాయని ఎంతో ప్రతీది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా బద్ది పోచమ్మ ప్రసిద్ధి చెందిందని చుట్టుపక్కల గ్రామాల భక్తులు మొక్కుకుంటున్నారు. అమ్మవారికి మొక్కలు చెల్లించడానికి జిల్లా నుండి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. శివసత్తుల పూనకాలతో డప్పు చప్పుళ్ల మధ్య ప్రభ బండ్ల తో బద్ది పోచమ్మ జాతర ఎంతో వైభవోపేతంగా జరుగుతుంది. అమ్మవారికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మొక్కలు సమర్పించుకున్నారు. అమ్మవారి జాతరలో ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ కుల మతాలకతీతంగా ఆరాధ్య దేవత బద్దిపోచమ్మ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహించుకోవడం గ్రామ ఐక్యతకు నిదర్శనమన్నారు.

శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయానికి విరాళం అందజేత

నవతెలంగాణ-పర్వతగిరి



మండలంలోని వడ్లకొండలో శ్రీ రంగనాయకుల స్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయానికి వడ్లకొండ గ్రామానికి చెందిన విగ్రహ దాతలు తోపుచెర్ల సావిత్రి రామారావు కుమారులు వేణుగోపాల్ రావు-శ్వేత దంపతులు, అనిల్ రావు-సునీత దంపతులు, ప్రవీణ్ రావు-చందన దంపతులు విగ్రహాలకు రూ. 3,01,116(రూ.మూడు లక్షల ఒక వెయ్యి నూట పదహార్లు) నగదు రూపకంగా ఆలయ కమిటీ కి శుక్రవారం వారు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమం లో మాజీ సర్పంచ్ అమడగాని రాజు యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

గుడిసె వాసులకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ మండలం పైడిపల్లి శివారులోని స్టాలిన్ నగర్ గుడిసె వాసులకు వ్యక్తిగత ఇండ్ల స్థలాలు ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం స్టాలిన్ నగర్ గుడిసె వాసులు వరంగల్ మండల తహసీల్దార్ ఇక్బాల్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి మాట్లాడుతూ వరంగల్ మండలం పైడిపల్లి శివారులో మూడు సంవత్సరాల క్రితం నుండి ఎస్సారెస్పీ ప్రభుత్వ భూమిలో పేదలు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారన్నారు. ఈక్రమంలో ఆరు నెలల క్రితం రెవెన్యూ అధికారులు, పోలీసు సిబ్బంది అక్రమంగా పేదల గుడిసెలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. స్టాలిన్ నగర్ గుడిసె వాసులకు ప్రభుత్వం ద్వారా ఇళ్ల స్థలాలు కేటాయించాలని హైకోర్టు వరంగల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వలేదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా స్టాలిన్ నగర్ గుడిసె వాసులకు ఇంటి స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వరంగల్ తాసిల్దార్ ఇక్బాల్ ను కలిసి విజ్ఞప్తి చేసినట్లు యాదగిరి తెలిపారు. ఈకార్యక్రమంలో నాయకులు రవిరాకుల ప్రసంగి, జన్ను ప్రవీణ్, చిలువేరు సుస్మిత, పట్టెం మొగిలి, సదయ్య, శంకరాచారి, సంపత్, ఓంకార్, కానుగంటి రాజు, సమ్మయ్య కనక లక్ష్మీ నీలమ్మ, రాజు, రాజయ్య, రామచంద్రం, భాగ్య, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల లక్ష్యం వైపు దూసుకెళ్లాలి

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



హన్మకొండ 55వ డివిజన్ బీమారంలోని కనిష్క డిగ్రీ అండ్ పీజీ కళాశాల వార్షికోత్సవ వేడుకలు ఎంటీఆర్ గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ గోలి వెంకట్ మాట్లాడుతూ కళాశాలలో విద్యతో పాటు సాఫ్ట్‌స్కిల్స్‌పై ట్రైనింగ్ ఇచ్చి డిగ్రీ పూర్తయ్యేలోపు ఎంఎన్‌సి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించే విధంగా విద్యార్థులను తయారు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ గోవర్ధన్ గౌడ్, ప్రిన్సిపల్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటా : చల్లా

నవతెలంగాణ-ఆత్మకూరు



బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని పెంచికలపేట మాజీ సర్పంచ్ కోరే రమేష్ తండ్రి సాంబయ్య ఇటీవలే మృతిచెందడంతో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండలంలోని మల్కాపేట మాజీ సర్పంచ్ బీఆర్ఎస్ నాయకులు బొజ్జ మధుకర్ తండ్రి కొద్దిరోజుల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. మండలంలోని నీరుకుల్ల గ్రామానికి చెందిన వేల్పుల సాంబలక్ష్మి కొద్దిరోజుల క్రితం మృతిచెందారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి వారి మృతికి గల కారణాలను మాజీ ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రివర్గంలో స్థానం కల్పించాలి

నవతెలంగాణ-దామెర

సమాజంలో అధిక జనాభా కలిగిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి మంత్రివర్గ విస్తరణలో స్థానం కనిపించాలని ఎస్సీ వర్గీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పాముల రమేష్ అన్నారు. శుక్రవారం దామెర మండల కేంద్రంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదిగల పక్షపాతి అని సమాజంలోని అన్ని వర్గాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించినప్పుడే సామాజిక న్యాయం జరుగుతుందని తెలంగాణలో ముదిరాజ్‌వర్గ ప్రజలు కూడా అధిక సంఖ్యలో ఉన్నట్లు సామాజికసర్వేలో తేలిందని వారికి కూడా మంత్రివర్గ విస్తరణలో ఒకరికి స్థానం కల్పించాలని ప్రజలు కోరుకున్న మార్పు అప్పుడే వస్తుందని అన్నారు. మాదిగల పట్ల ప్రేమ ఉన్నట్లు కేంద్ర బిజెపి పార్టీ నటిస్తున్నదని వారి మంత్రివర్గంలో కూడా మాదిగలకు ముదిరాజులకు స్థానం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కి జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు ముదిరాజులకు స్నానం కల్పించాలని తాము పత్రికాముఖంగా విజ్ఞప్తి చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

నవతెలంగాణ-ఎల్కతుర్తి



వేగంగా వెళుతున్న లారీ అదుపుతప్పి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన సంఘటనలో ఓ యువతి మృతిచెందగా, మరో యువతీ తీవ్రగాయాలపాలైన సంఘటన ఎల్కతుర్తి మండలంలోని శాంతినగర్ గ్రామశివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన కీర్తి (23), చందన (22)లు గ్రోమోర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా శుక్రవారం కేశవట్నం మండలానికి వెళ్లి తిరిగి వస్తుండగా గుజరాత్ నుండి విజయవాడ వైపు వెళుతున్న లారీ కీర్తి, చందనలు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని శాంతినగర్ సమీపంలో వెనుక నుండి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కీర్తి, చందనలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించి వరంగల్ ఎంజీఎంకు తరలించగా కీర్తి మృతి చెందగా చందన చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చైతన్య యూనివర్సిటీలో ఆకట్టుకున్న ఫ్లాష్‌మాబ్

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా



హనుమకొండ కిషన్‌పురలోని చైతన్య డీమ్డ్ టు బీ యూనివర్సిటీలో విద్యార్థుల ఫ్లాష్ మాబ్ అందరినీ ఆకట్టుకుంది. రంగు రంగుల వేషధారణలతో విద్యార్థులు పాటలకు నృత్యం చేస్తూ అలరించారు. చైతన్య యూనివర్సిటీ ఆవరణలో డీజే, ఫోక్‌సాంగ్స్, వివిధ రకాల పాటలకు స్టేప్పులేశారు. వారికి తోడు విద్యార్థులు సైతం హుషారైన నత్యాలను ప్రదర్శించి ఉర్రూతలూగించారు. డ్యాంసెల్ఫోన్లలో చిత్రీకరిస్తూ ఎంజాయ్ చేశారు.

ఈ సందర్భంగా చైత న్య యూనివర్సిటీ కులపతి డాక్టర్ పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల మానసికోల్లాసానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవీందర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదె రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాలు వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యం

- ప్రముఖ నాట్య కళాకారుని హిమాన్సి కాట్రగడ్డ

నవతెలంగాణ-ధర్మసాగర్



పురాతన ఆలయాలను వెలుగులోకి తీసుకురావడమే మా లక్ష్యం అని ప్రముఖ నాట్య కళాకారిణి హిమాన్సి కాట్రగడ్డ అన్నారు. శుక్రవారం మండలంలో ముప్పారం గ్రామంలోని చారిత్రాత్మ కమైన శ్రీ ముఖ్యనాథస్వామి దేవాలయంలో టెంపుల్ డ్యాన్స్ ఫౌండర్, ప్రముఖ నాట్య కళాకారిణి హిమాన్సి కాట్రగడ్డ వారి శిష్య బృందంతో ఆలయ నత్యం కార్యక్రమం షూటింగు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల్లోని పురాతన ఆలయాలను వెలుగులోకి తీసుకుని రావడానికి నావంతు కృషి చేస్తానని చెప్పారు.ఇలాంటి కార్యక్రమం చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమ సందర్భంగా ముఖ్యనాథస్వామి దేవాలయం అభివృద్ధికి అభ్యున్నతికి నా వంతు పాత్రను అందించేందుకు ఎల్లవేళలా సిద్ధంగా ఉంటానన్నారు.ఈ కార్యక్రమం విశ్వావసు నామ సంవత్సర ఉగాది రోజున రిలీజ్ చేస్తామని ఆమె తెలిపారు.

ఈ సందర్భంగా కూచిపూడి నాట్య కళాకారిణి హిమాన్సీ కాట్రగడ్డ ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఆలయ పునఃనిర్మాణ వ్యవస్థాపక చైర్మెన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర సత్కరించి, ముఖ్యనాథస్వామి దేవాలయం జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి ఉపాధ్యక్షులు గుంటిపల్లి సంపత్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఏతిరాజుల నరసింహస్వామి, సోషల్ మీడియా ఇన్చార్జి మారబోయిన తిరుమల్, నాట్య కళా బృందం హిమాన్సి కాట్రగడ్డ, కుందూరు అనిశ్రితరెడ్డి, అనన్యరెడ్డి, దుంపేటీ అన్విక, కుల్ల లక్ష్మి ప్రహర్షిత, తల్లి దండ్రులు శ్రీనివాసరావు కాట్రగడ్డ, లక్ష్మీ కాట్రగడ్డ, కుందూరు సతీష్‌రెడ్డి, సృజన, నాని మల్లోజు, కుడికాల వెంకీ, సంఘీ ప్రసాద్ తదిరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఆకాంక్షల మేరకు ముందువెళతాం

నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

వరంగల్ కు ప్రత్యేక ప్రెస్ క్లబ్ ఏర్పాటు అంశంలో తూర్పు జర్నలిస్టుల ఆకాంక్షల మేరకు ముందుకెళతామని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు పేర్కొన్నారు. తూర్పు జర్నలిస్టు నేతలు గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ బాధ్యులతో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం సమావేశమయ్యారు. వరంగల్ ప్రత్యేక జిల్లాగా ఏర్పడినందున తమకు ప్రత్యేక ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసుకోవడం తప్పని సరైందని. వరంగల్‌లో క్లబ్ ఏర్పాటుకు ఫర్నిచర్‌తో సహా కొంత ఆర్థిక సహాయం కూడా అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోల్ల అమర్, వరంగల్ తూర్పు జర్నలిస్టు నేతలు బుదారపు శ్రీనివాస్, సంగోజు రవి, నరేందర్, దుర్గాప్రసాద్, తౌటి కామేశ్వర్‌లు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే ప్రత్యేక కార్యక్రమాలు

నవతెలంగాణ-నడికూడ



ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులలోని సజనాత్మకతను వెలికి తీసేందుకు పీఎం శ్రీ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నడికూడ మండల విద్యాశాఖ అధికారి కె.హనుమంతరావు తెలిపారు. శుక్రవారం వరికోలు పీఎస్‌లో హెచ్‌ఎం శరత్ గౌడ్ ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవం నిర్వహించగా ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పాఠశాలల నిర్మాణాత్మక అభివృద్ధితో పాటు బోధన పరమైన పరిజ్ఞానం పెంపొందించేందుకు ప్రభుత్వం పీఎంశ్రీ పథకం ద్వారా ప్రత్యేక నిధులను మంజూరు చేస్తుందన్నారు. విద్యార్థులకు బోధనలో భాగంగా క్షేత్ర సందర్శనలు, ప్రత్యేక్ష అనుభవక పూర్వకమైన భాగస్వామ్యం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల అభివద్ధికి కషి చేస్తున్న హెచ్‌ఎం శరత్ గౌడ్‌ను అధికారులు, తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పీజీ హెచ్‌ఎం జి.విజయలక్ష్మి, పిఆర్‌టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్ పర్సన్ పోచంపల్లి కవిత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పరకాలలో ఇరుకుగా మారిన అంబేడ్కర్ జంక్షన్





- ట్రాఫిక్ జామ్‌తో వాహనదారుల ఇబ్బందులు
- రద్దీ కనుగుణంగా జరగని విస్తరణ
- కలగా మారిన బైపాస్ నిర్మాణం

నవతెలంగాణ-పరకాల

పరకాల పట్టణంలోని అంబేద్కర్ జంక్షన్ ఇరుకుగా మారడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నట్లుగా స్థానికులు, వాహనదారులనుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి. హనుమకొండ టు భూపాలపల్లి 353సి జాతీయ రహదారితో పాటు హుజురాబాద్, కరీంనగర్ నుండి వేములవాడ వరకు ప్రయాణించే వివిధ వాహనాలతో ఈ జంక్షన్ ఎల్లప్పుడూ రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా ఇసుక,బొగ్గు,జెన్ కో నుండి యాస్ లారీలు,సింగరేణి,జెన్ కోలకు వివిధ మిషనరీస్ తో తరలించే కంటైనర్స్ లాంటి భారీ వాహనాలు సైతం ఈ జంక్షన్ నుండే ప్రయాణించాల్సి ఉంటుంది. అంలాంటి పరిస్థితిలో పెరిగిన రద్దీకి అనుగుణంగా ఇప్పటికే అంబేద్కర్ జంక్షన్ విస్తరించాల్సి ఉంది. కానీ పాలకులు, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం మూలంగా జంక్షన్ విస్తరణ కలగానే మిగిలిపోయిందనేది పట్టణ వాసుల అభిప్రాయం. రద్దీ మూలంగా సమస్యాత్మకంగా మారిన అంబేద్కర్ జంక్షన్, అంబేద్కర్ విగ్రహ పునః ప్రతిష్ఠ అనంతరం మరింత ఇరూకుగా మారిందనేది కనీస అవగాహన ఉన్న ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది.అంబేద్కర్ విగ్రహ పునః ప్రతిష్ఠ పట్ల ఎవరికీ ఏ అభ్యంతరాలు లేనప్పటికీ జంక్షన్ విస్తరణ పట్ల అప్పటి మున్సిపల్ పాలక వర్గం కానీ, అధికార యంత్రాంగానికి కానీ కనీస అవగాహన కొరవడిందా...?అనేది చర్చనీయాంశంగా మారింది.అప్పుడున్న పరిస్థితుల్లో కాంట్రాక్టర్ కి, ప్రజా ప్రతినిధులకు అనుగుణంగా అధికార యంత్రాంగం పని చేసారు తప్పితే దీర్ఘకాలిక ప్రయోజనాలపై దష్టి సారించలేదనేది ఇక్కడ బహిరంగ రహస్యం.

కలగా మిగిలిన బైపాస్ రోడ్డు....

సింగరేణి, జెన్‌కోలకు సంబంధించిన బొగ్గు, యాష్ లారీలతో పాటు, వాటి అవసరాల కోసం తరలించే భారీ కాంటైనర్స్ పరకాల మీదుగానే ప్రయాణించాల్సి ఉంది. అంతేకాకుండా గోదావరి పరివాహక ప్రాంతం నుండి రాజధానికి తరలించే ఇసుక లారీలు సైతం నిత్యం పరకాల మీదిగానే వెళుతున్నాయి. ఇలా నిత్యం పరకాల అంబేద్కర్ జంక్షన్ నుంచి అటు కమలాపుర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్‌కి హనుమకొండ రూట్ నుంచి రాజధాని వరకు పరకాల అంబేద్కర్ జంక్షన్ మీదుగా నిత్యం వందలాది లారీలు ప్రయాణస్తుంటాయి. రద్దీని దష్టిలో పెట్టుకొని గతంలో సింగరేణి సైతం బైపాస్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు సమాచారం. అప్పటి మున్సిపల్ పాలకవర్గం బైపాస్ నిర్మాణాన్ని పట్టించుకోకుండా సింగరేణి నిధులను ఇతరత్రా అవసరాలకు వినియోగించారనేది విశ్వాసనీయ సమాచారం. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అంబేద్కర్ జంక్షన్ విస్తరణ పట్ల దష్టి సారించి అభివద్ధికి కషి చేయాలని, తాత్కాలికంగా ట్రాఫిక్ జామ్ కాకుండా ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను నెలకొల్పి సమస్యకు పరిష్కారం చూపాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అంబేద్కర్ జంక్షన్ విస్తరణకు కృషి చేయాలి :
ఏకు శంకర్ మాదిగ



లారీలు, కంటైనర్ల వంటి భారీ వాహనాలతో నిత్యం రద్దీగా ఉండే అంబేద్కర్ జంక్షన్ విస్తరించాలి. జంక్షన్ ఎరుపుగా మారడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. అంతేకాకుండా ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి జంక్షన్ విస్తరణకు కృషి చేయాల్సి ఉంది.

బైపాస్ రోడ్ నిర్మించాలి : దొగ్గెల తిరుపతి,
సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు



అంబేద్కర్ సెంటర్ మీదుగా లారీలు, కంటైనర్స్ ను నిషేధించాలి. ఇందుకు పరకాల బైపాస్‌రోడ్డు నిర్మాణం జరగాలి. గతంలో సింగరేణి సంస్థ నుండి కోటికి పైగా నిధులు సమకూరాయి. ఆ నిధులను నిర్మాణానికి వాడాల్సి ఉన్నప్పటికీ ఆ నిధులను దారి మళ్లించడంతో నగర విస్తీర్ణంతోపాటు తరచూ ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలు జరగడానికి కారణం అవుతుంది. ఇప్పటికైనా ఎమ్మెల్యే చొరవతీసుకొని ఇం జనీరింగ్ అధికారులతో బైపాస్ రోడ్డు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలి.

మున్సిపల్ కార్మికుల డబ్బులు వెంటనే చెల్లించాలి



- సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య

నవతెలంగాణ-నయీంనగర్

మేడారం సమ్మక్క-సారక్క జాతర, ఐనవోలు మల్లికార్జునస్వామి ఉత్సవాల్లో పనిచేసిన వరంగల్ నగర మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులకు నేటికీ డబ్బులు చెల్లించక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే డబ్బులను చెల్లించాలని సీఐటీయూ మున్సిపల్ యూనియన్ హను మకొండ జిల్లా కార్యదర్శి టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. హనుమకొండలోని 49వ మున్సిపల్ డివిజన్ లో శుక్రవారం జరిగిన మున్సి పల్ కార్మికుల సమావేశాని కి ఉప్పలయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత 2024 ఫిబ్రవరిలో జరిగిన మేడారం సమ్మక్క జాతరలో వరంగల్ నగర మున్సిపల్ కార్పొరేషన్ నుండి 300 మంది కార్మికులు శానిటేషన్ పనులు నిర్వహించి, ఒకరు ప్రాణాలు కోల్పోయారని, ఐలోని జాతరలో కూడా పనులు నిర్వహించారని ఏడాది గడిచినా ఇంతవరకు వాటికి సంబంధించిన డబ్బులు ములుగు జిల్లా కలెక్టరేట్ నుండి గాని, దేవదాయ శాఖ నుండి గాని డబ్బులు చెల్లించలేదన్నారు. జాతరలో పనిచేసిన మున్సిపల్ కార్మికులకు ఇవ్వవలసిన డబ్బులు వచ్చి వారం రోజులు అవుతున్నా, ఇవ్వకుండా వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ అధికారులు వెంటనే సమ్మక్క జాతర, ఐలోని జాతరలో పనిచేసిన మున్సిపల్ కార్మికులకు డబ్బులు వెంటనే వారి ఖాతాలో వేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన నిర్వహించవలసి వస్తుందని హెచ్చరించారు. గతంలో జాతరలో పనిచేసిన డబ్బులు అన్ని వారికి ఇవ్వకుండా కొంతమంది అధికారులు రూ.300 లు నుండి రూ.500లు వరకు మినహాయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఏప్రిల్ 27న బీఆర్ఎస్ రజితోత్సవ బహిరంగ సభ

నవతెలంగాణ-నక్కలగుట్ట



బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా ఏప్రిల్ 27న ల్కతుర్తి మండల పరిధిలో నిర్వహించనున్న రజతోత్సవ బహిరంగ సభను నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ పిలుపునిచ్చారు. శుక్రవారం బాలసముద్రం బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దాస్యం మాట్లాడుతూ తెలంగాణ ప్రజల 60 ఏళ్ల కలను సాకారం చేసింది టీఆర్ఎస్ అన్నారు. బీఆర్ఎస్ 25 ఏండ్ల పాటు ప్రజల ఆకాంక్షల మేరకు బీఆర్ఎస్ పార్టీ పని చేసిందని, 14 ఏండ్ల పాటు తెలంగాణ కోసం కొట్లాడామని, 10 ఏండ్ల పాటు కేసీఆర్ నేతృత్వంలో నూతనంగా ఏర్పడిన తెలంగాణను దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిపారన్నారు. ఏప్రిల్ 27న హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో లక్షలాది మందితో సభ నిర్వహించనున్నామని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా లో 25 ఏండ్ల సభ నిర్వహించేందుకు నిర్ణయించిన కేసీఆర్ కు కతజ్ఞతలు తెలుపుతూ ఎల్కతుర్తి మండల కేంద్రంలో 1200 ఎకరాల్లో సభ నిర్వహించేందుకు స్వచ్ఛందంగా రైతులు వారు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని వారి కి కూడా కృతజ్ఞతలని, సభకు వచ్చే ప్రజల అందరికీ తాగునీరు, మజ్జిగ, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నామని, సభ కోసం అన్ని అనుమతులు కోసం అప్లై చేయడం జరుగుతోందన్నారు. మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ బాబు మాట్లాడుతూ 25 ఏండ్ల సభ నిర్వహించే అవకాశం రావడం అదష్టంగా భావిస్తున్నామని, రాష్ట్రం నుంచి వచ్చే ప్రజలందరికి అసౌకర్యం కలగకుండా చూస్తామని, వాలంటీర్లను ఇప్పటికే తీసుకోవడం జరిగిందని,వాహనాలు, ఇతర పార్కింగ్ స్థలాలను గుర్తించడం జరిగిందని అన్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ కోసమే పుట్టింది బీఆర్ఎస్, 25 ఏళ్లు తెలంగాణ కోసం, ప్రజల కోసమే పని చేసిన పార్టీ మాది, మా నాయకుడు కేసీఆర్అని,మరో 25 ఏండ్ల కోసం మార్గనిర్దేశం చేసేందుకు సభ పెడుతున్నామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, డాక్టర్ టి.రాజయ్య, ఎమ్మెల్సీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, కార్పొరేటర్లు, జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ భవనాలు పరిశీలించిన డీఆర్‌డీఓ



నవతెలంగాణ-దామెర

మహిళలకు నైపుణ్య శిక్షణ కల్పించేందుకు దామెర మండలం లాదెళ్ల గ్రామంలోని సాగునీటిపారుదల భవనాలను ఉపయోగించుకుంటున్న సందర్భంగా వాటిని ఆధునీకరిస్తున్న సందర్భంగా వాటి పనులు ఎంత మేరకు జరిగాయో తెలుసుకోవడానికి డిఆర్డిఓ మేన శీను శుక్రవారం పరిశీలించారు. పని వివరాలను ఏపిఎం ఝాన్సీని అడిగి తెలుసుకుని పనులను త్వరగా పూర్తి చేసే ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మరియు స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఈ విషయమై మానిటరింగ్ చేస్తున్నారని తెలిపారు. అనంతరం లేదల్ల గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించి వన సేవకులు ప్రత్యేక శ్రద్ధతో వేసవి కాలం కావడంతో రోజుకి రెండు పర్యాయాలు నీటిని అందించాలని తెలిపారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో నిర్మిస్తున్న పశువుల షెడ్డు ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులందరూ ఇలాంటి ఉపయో గకరమైన పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏపీఎం ఝాన్సీ, ఏపీ ఓ శారద, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, నాయకులు మన్నెం ప్రకాష్ రెడ్డి, గుడిపాటి శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెడ్డిగ్యాంగ్ దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు

నవతెలంగాణ-దామెర



హనుమకొండ పరిసర గ్రామాల్లో చెడ్డీ గ్యాంగ్ దొంగలు సంచరిస్తున్నారని గ్రామాల్లో అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పరకాల రూరల్ సీఐ రంజిత్ రావు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి సమయంలో తాళాలువేసి ఉన్న ఇండ్లలో వీరు దొంగతనాలకు పాల్పడుతున్నారని ఊర్లకు ప్రయాణాలకు వెళ్లేవారు ఇండ్లలో నగదు గాని విలువైన వస్తువులను దాచకూడదన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానితులు కనిపిస్తే వెంటనే డయల్ 100 గాని, సీఐ 8712685226, ఎస్ఐ 8712685228 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పంపిణీ

- తహసిల్దార్ కల్వల సత్యనారాయణ

నవతెలంగాణ-శాయంపేట



ఏప్రిల్ నుండి రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తహసిల్దార్ కల్వల సత్యనారాయణ తెలిపారు. మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం రేషన్‌డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెల నుండి ప్రభుత్వం రేషన్‌కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం స రఫరా చేస్తున్నందున మార్చిలో దొడ్డు బియ్యం నిల్వలు ఉంటే ఆ నిల్వలను సివిల్‌సప్లయ్ నుండి ఆదేశాలు వచ్చేంత వరకు భద్రపరచాలని రేషన్ డీలర్లకు సూచించారు. ఏప్రిల్లో మాసంలో లబ్ధిదారులకు సన్న బియ్యం మాత్రమే ఉదయం 7 గంటల నుండి పంపిణీ చేయాలన్నారు. లబ్ధిదారులకు డబ్బులు ఇచ్చి రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే డీలర్లపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రమేష్ ఖన్నా, రమేష్, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు సామల మల్లయ్య, డీలర్లు పాల్గొన్నారు.

చర్లపల్లి పాఠశాలను సందర్శించిన విద్యార్థులు

నవతెలంగాణ-నడికూడ



మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపురం మండలం నారాయణపూర్ పిఎంశ్రీ ప్రాథమికో న్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ట్విన్నింగ్ స్కూల్లో భాగంగా శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం అచ్చ సుదర్శన్ మాట్లాడుతూ ట్వినింగ్‌స్కూల్స్ అంటే వివిధ సామాజిక, ఆర్థిక నేపథ్యాల నుండి వచ్చిన పాఠశాలల మధ్య భాగస్వామ్యం అన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా పాఠశాలల మధ్య ఉత్తమ అభ్యాసాలు, వనరులను పంచుకునే వాతావరణాన్ని సృష్టించడం దీని లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కంచరాజు కుమార్, పిఎంశ్రీ యూపీఎస్ హెచ్‌ఎం టి.ఓదేలు, బి.కమలాకర్ డి.సదయ్య పి.రాకేష్, ఎం.రేవతి, ఎస్ సదానందం, ఐఆర్పి, రమేష్, అంగన్వాడీ టీచర్స్ బీముడి లక్ష్మీ, నందిపాటి సంధ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సత్ ప్రవర్తనతో మెలగాలి : సీఐ

నవతెలంగాణ-ఎల్కతుర్తి



రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని సిఐ పులి రమేష్ అన్నారు. శుక్రవారం సర్కిల్ కార్యా లయంలో ఎస్ఐ అక్కినేపల్లి ప్రవీణ్ కుమార్ ఆ ధ్వర్యంలో మండలంలోని రౌడీషీటర్లందరికీ అ వగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సం దర్భంగా సీఐ మాట్లాడుతూ గతంలో క్షణికావేశం తో చేసిన తప్పులకు శిక్షపడి రౌడీషీటర్లుగా ముద్రపడ్డారని ఇప్పటికైనా మంచి మార్గంలో నడిచి సత్ ప్రవర్తనతో మెలిగితే ఉన్నత అధికారులతో మాట్లాడి రౌడీషీటర్లు తొలగిం చేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వంగర ఎస్ఐ దివ్య, హెడ్ కాని స్టేబుల్ మల్లేశం, విఠల్‌రావు, నిరంజన్ తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఎర్రబెల్లి పరామర్శ

నవతెలంగాణ-ఐనవోలు



పెరుమాండ్ల గూడెం గ్రామంలో వర్ధన్నపేట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు తుళ్ళ కుమారస్వామి మామా దుపెల్లి రాజయ్య మృతి చెందారు. విషయం తెలుసుకొని వారి స్వగహం కి వెళ్లి వారి భౌతికదేహానికి పూల మాల వేసి వారి కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించారు.

ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ మినీ కుంభమేళా

- మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్

నవతెలంగాణ-ఎల్కతుర్తి

ఏప్రిల్ 27న బీఆర్ఎస్ పార్టీ రజితోత్సవ వేడుకలను ఎలకదుర్తిలో మినీ కుంభమేళా మాదిరిగా నిర్వహించనున్నట్లు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే ఓడితల సతీష్ కుమార్ అన్నారు. బీఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ సీఎం కేసీఆర్ సూచనతో రాష్ట్రంలో ఆరు స్థలాలు పరిశీలించినప్పటికీ ఎల్కతుర్తి కేంద్రం మూడు జిల్లాలకు సరిహద్దుగా వరంగల్, హనుమకొండ ఉమ్మడి జిల్లాలో భాగంగా నిర్వహించాలని సూచించారని పేర్కొన్నారు. దానికోసం మాజీ ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి సుదర్శన్‌రెడ్డి, వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీపోచంపల్లి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర రుణ విమోచన సమితి మాజీ చైర్మన్ నాగుర్ల వెంకన్న లతో కలిసి స్థలాన్ని పరిశీలించమన్నారు. సుమారు 1300 ఎకరాల భూమి అవసరం పడుతుందని ఇక్కడి రైతుల అనుమతి పత్రాలు తీసుకుని కేసిఆర్ కు విన్నవించామన్నారు. దాంతో ఆయన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు జాగ్రత్త లు తీసుకోవాలని పేర్కొన్నారు. మండల బీఆర్ఎస్ శ్రేణులు నెల రోజులపాటు సైనికులు వలె పనిచేసి ఎల్కతుర్తికి మాట రాకుండా పేరు తీసుకురావాలని తెలిపారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ శేషగిరి, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు కడారి రాజు, మాజీ వైస్ ఎంపీపీ నగేష్, తంగెడ మహేందర్, పోరెటి రవీందర్ రెడ్డి, గొల్లె మహేందర్, సాతూరు చంద్రమౌళి, కోరే రాజకుమార్, తదితరులు ఉన్నారు.



డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-కోల్‌బెల్ట్

మాదకద్రవ్యాలు వద్దు..జీవితం ముద్దు అంటూ డ్రగ్స్‌పై విద్యార్థులకు ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్, తెలంగాణ యాంటీ నార్కోటిక్ సోల్జర్ పెద్ది పథ్వీ అవగాహన కల్పించారు. శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో విద్యార్థులకు మత్తు పదార్థాలు, సిగరెట్లు, మద్యం, జూదం, బెట్టింగ్ వ్యసనాలు వాటి పర్యవసనాలు వివరించారు. విద్యార్థులు డ్రగ్స్ బారిన ఎలా పడు తున్నారు, డ్రగ్స్ తీసుకున్నవారు ఎలాంటి అనారోగ్యాలకు గురవుతారు, వాటి నుండి ఎలా విముక్తి పొందాలి అనే అంశాలపై అనేక వీడియోల ద్వారా సమాచారం అందించడమే కాకుండా, అవసరమైతే టోల్ ఫ్రీ నెంబర్ 1908 కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని, ఇచ్చిన వారి సమాచారం గోప్యంగా ఉంటుందని వివరించారు.అనంతరం విద్యార్థులతో డ్రగ్స్ జోలికి పోమని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో సిసిఎస్ కానిస్టేబుల్ అశోక్, ఇంపాక్ట్ కుటుంబ సభ్యుడు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



వరి పొలాన్ని సందర్శించిన శాస్త్రవేత్తలు

నవతెలంగాణ టేకుమట్ల

టేకుమట్ల మండలం రామకృష్ణాపూర్ టి గ్రామానికి చెందిన కాసర వేణి కుమార్ తన వరి పొలంలో స్థానిక మహేశ్వరి ఫర్టిలైజర్ షాపులో 1010 విత్తనపు వడ్లు కొనుగోలు చేసి తన ఎకరం పొలంలో సాగు చేశాడు వరి పొలంలో వరి గొలుసుకు బదులు తెల్ల బొంతు గడ్డి ఎక్కువగా ఉందని రైతు ఫిర్యాదు చేయడం జరిగింది. రైతు ఫిర్యాదు మేరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లగా శుక్రవారం వరంగల్ వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ నాగ భూషణం, డాక్టర్ విశ్వశ్వేత, స్థానిక వ్యవసాయ అధికారి మెరుగు కళ్యాణి, వ్యవసాయ విస్తరణ అధికారి రాహుల్ రైతు కాసరవేణి కుమార్‌తో కలిసి పంటను పరిశీలించారు. అనంతరం శాస్త్రవేత్తల పరిశీలన రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి కళ్యాణి తెలిపారు.



తెలంగాణ అసెంబ్లీ చరిత్రాత్మక నిర్ణయం

గోరుబోలి (లంబాడా) భాషకు గౌరవం

ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ పోరిక సమ్మయ్యనాయక్

నవతెలంగాణ-భూపాలపల్లి

దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, గోరుబోలి (లంబాడ) భాషకు గౌరవం ఇచ్చారని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ పోరిక సమ్మయ్యనాయక్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గోరుబో (లంబాడా) భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్లో చేర్చేందుకు ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపడం గర్వించదగ్గ విషయమన్నారు. భాషా పరిరక్షణలో మరో కీలక ముందడుగు అని, ఇది లంబాడా భాషాభిమానులకు గొప్ప గర్వకారణం అన్నారు. ఈ చారిత్రక నిర్ణయాన్ని స్వాగతిస్తూ భాషా హక్కుల సాధన కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ముందడుగు ప్రశంసనీయమని కొనియాడారు. ఇందుకు ప్రత్యేకంగా కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



'రాజీవ్ యువ వికాసం' సద్వినియోగం చేసుకోవాలి

ఏప్రిల్ 5లోగా దరఖాస్తులు సమర్పించాలి

ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాచర్ల వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-భూపాలపల్లి

రాజీవ్ యువ వికాసం పథకాన్ని అర్హత కలిగిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఏప్రిల్ 5చివరి తేదీ కావున దరఖాస్తులు సమర్పించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాచర్ల వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం ఆయన 'నవతెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్రంలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి అవకాశాలతో ఆర్థిక పురోగతి పెంపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన రాజీవ్ యువవికాసం పథకం ప్రకటించిందన్నారు. ఈ పథకం కింద ఎస్సీ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి పథకాలు అందించడానికి 2024-25 ప్రణాళికను ఆమోదించిందన్నారు.ఇందులో వ్యవసాయ అనుబంధ పథకాలు, పశుపోషణ పథకాలు, ఉద్యానవన పథకాలు, వాణిజ్య వ్యాపార పథకాలు రవాణా రంగం పథకాలు ఉంటాయన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని అర్హత ఆసక్తి గల వారు ఉదీవీమీా ఆన్లైన్ పోర్టల్ ద్వారా https://tgobmmsnew.cgg.gov.in ఆధార్ కార్డ్, రేషన్ కార్డు /ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, పట్టాదారు పాస్‌పుస్తకం, సదరం సర్టిఫికేట్, పాస్‌ఫోటోతో https:// tgobmm-snew. cgg.gov.in రిజిస్ట్రేషన్ చేసుకుని సంబధిత ఆన్లైన్ ధరఖాస్తుకు ధృవీకరణ పత్రాలను జతచేసి సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం/మున్సి పాలిటీ కార్యాలయంలో ఏప్రిల్ 5వ తేదీలోగా సమర్పించాలని సూచించారు.మరిన్ని వివరాలకు https://tgobmmsnew.cgg.gov.iఅవెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.






బైపర్కేషన్‌కు అనుమతి ఇవ్వాలి

ఎస్ఎఫ్ఐజిల్లా ప్రధాన కార్యదర్శి తోకల రవి

నవతెలంగాణ-మంగపేట

మండలంలోని మల్లూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాల బై పర్కేషన్‌కు జిల్లా విద్యాశాఖ అధికారులు అనుమతి ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల రవి కోరారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జాగటి రవి అధ్యక్షతన మండలంలోని కమలాపురం గ్రామంలో జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మల్లూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు బైపర్కేషన్‌కు అనుమతులు ఇవ్వాలని, గతంలో అనేకమార్లు జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వలన పేద మధ్యతరగతి విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లూరు పాఠశాల బైపర్కేషన్ విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. పేద బడుగు బలహీనవర్గాల విద్యార్థులు పై తరగతులకు వెళ్లేందుకు అవసరమైన బైపర్కేషన్‌కు అనుమతులను మల్లూరు పాఠశాలకు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి తక్షణమే అనుమతులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలోఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు స్వామి, నరసింహరావు పాల్గొన్నారు.



డిగ్రీ కళాశాలలో ముందస్తు ఉగాది

నవతెలంగాణ-మహదేవపూర్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముందస్తు ఉగాది సంబురాలను సాంస్కతిక విభాగం కన్వీనర్ డాక్టర్ పోరిక రాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ,విద్యార్థులకు స్వస్తి శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియచేస్తూ భారతీయ సాంప్రదాయం ప్రకారం చైత్ర శుక్ల పాడ్యమినాడు ఉగాది రోజున సృష్టి జరిగిందని పురాణలో చెప్పబడిందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఈ చక్రం ప్రతి వాస్తవానికి 60సంవత్సరాలు కలిగి ఉంటుందని, మన జీవితంలో ఎదురయ్యే కష్ట, సుఖాలు, సవాళ్ళని సంయమనంతో స్వీకరించి మంచి దృక్పథంతో ముందుకు వెళ్లాలని,ఇంత మంచి తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ఉట్టిపడేలా చేసిన విద్యార్థులకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో అధ్యాపక బృందం డాక్టర్ శ్రీనివాస్ వేముల రమేష్, రమేష్, రాజేందర్, మున్నయ్య, పరశురాములు, రవీందర్ మాధురి, రమ్య మరియు అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

భానుడి భగ భగ..

జనం విలవిల





నవతెలంగాణ-భూపాలపల్లి

భానుడి భగభగతో జనం విలవిల్లాడుతున్నారు. మండుతున్న.. ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. మార్చి మాసంలో ఎప్పుడూ ఈ రకమైన పగటి ఉష్ణోగ్రతలు చూడలేదంటున్నారు జనం. సహజంగా ఏప్రిల్ నెలలో క్రమక్రమంగా ఉష్ణోగ్రతలు పెరుగు తుంటాయి. ఈ ఏడాది నెల రోజులు ముందే ఎండలు భగ్గుమంటున్నాయి. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు పెరగడంతో పాటు రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. మున్ముందు ఎండలు మరింత పెరిగే అవకాశాలు ఉంటాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

> భానుడి భగ భగ..
> విలవిలమండుతున్న జనం
> ఎండలు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
> కోల్ బెల్ట్ ఏరియాలో మరింత ఎక్కువ
> నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు
> ఏప్రిల్, మే లో మరింత పెరిగే అవకాశం

మండుతున్న ఎండలు..పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గరిష్టంగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. ఎండ వేడిమికి ఇప్పటి నుంచే ఫ్యాన్లు, ఏసీల వాడకం మొదలు కావడంతో విద్యుత్ వినియోగం పెరగడం మొదలైందని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న ఉపాధి హామీ కూలీలు

వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలు, రోజువారి కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు మరింత ముదిరే అవకాశం ఉండడంతో ప్రజలు ఉపశమనం పొందడానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ముఖ్యంగా కూలర్లు, ఏసీలకు గిరాకీ పెరిగింది. పాత వాటికి రిపేర్లు చేయిస్తున్నారు.

ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి..

ప్రజలు ఎండ నుంచి రక్షణ పొందేందుకు గొడుగులు, టవళ్లు, టోపీలను ఆశ్రయిస్తున్నారు. మరో పక్క దాహార్తిని "తీర్చుకోవడానికి శీతలపానీయాలు చెరుకు రసం, లస్సీ, జ్యూస్ లాంటివి సేవిస్తున్నారు. మొత్తానికి జిల్లా వ్యాప్తంగా వారం రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. ఎండ వేడిమితో సతమతమవుతున్నారు. ఇలానే పెరుగుతూ వడగాలులు తీవ్రమైతే వడదెబ్బకు గురికాకుండా వేసవితాపం నుంచి రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

నిర్మానుష్యంగా మారుతున్న రోడ్లు...

జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిపోవడంతో మధ్యాహ్నం వేళల్లో రోడ్లన్నీ నిర్మానుషంగా మారిపోతున్నాయి. ఎండలకు తోడు వడగాలులు కూడా వీస్తోండటంతో జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. దీంతో ఎక్కడా చూద్దామన్న రోడ్లపై ఒక్కరూ కనిపించడం లేదు. కరోనా సమయంలో తలపించిన విధంగా ప్రధాన రోడ్లతో సహ అన్ని రహదారులు నిర్మానుషంగా కనిపిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12గంటల్లోపే ప్రజలు పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకుంటున్నారు. పాఠశాలలు ఒంటిపూట బడులు మధ్యాహ్నం 12.30 గంటలకే ముగియడంతో విద్యార్థులు కూడా ఆ సమయంలోపు ఇళ్లకు చేరుకుంటున్నారు. ఆపై ఏమైనా పనులు ఉంటే సాయంత్రం ఆరు గంటల తర్వాత బయటకు వస్తున్నారు. అంటే దాదాపు మధ్యాహ్నం 4గంటల పాటు రోడ్లపై ఒక్కరూ కనబడడంలేదు. మార్చినెలలో పరిస్థితి ఇలా ఉందంటే ఇక ఏప్రిల్, మే నెలల్లో ఎలా ఉండబోతుందోననే చర్చ మొదలైంది.



కోల్‌బెల్ట్ ఏరియాలో మరింత తీవ్రం

భూపాలపల్లి, గణపురం మండలాల్లో సింగరేణి గనులు, కేటీపీపీ ఉండడంతో ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. ఓపెన్ కాస్ట్‌లు, కేటీపీపీలతో ఈ ప్రాంతాల్లో ఇప్పటి నుంచే పగటి పూట వేడి గాలులు వీస్తున్నాయి. మరో రెండు నెలల్లో ఉష్ణోగ్రతలు పెరిగితే ఎలాంటి ఇబ్బందులు పడాల్సి వస్తుందోనని ఇక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓపెన్ కాస్ట్, కేటీపీపీలో పని చేసే కార్మికులు,ఉద్యోగులు వేడి తీవ్రతతో ఇబ్బందులు పడుతున్నారు. యాజమాన్యాలు ఉక్కపోతకు ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టడం లేదని, తక్షణమే చర్యలు చేపట్టాలని కార్మికులు, ఉద్యోగులు కోరుతున్నారు.

గర్భిణులు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి



గర్భిణులు ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఎండాకాలంలో ఎక్కువగా ప్రయాణాలు చేయకూడదు. వడదెబ్బ తగిలినట్లు అయితే చల్లటి నీళ్లు తాగుతూ, పడుకొని విశ్రాంతి తీసుకోవాలి. ఎడమ వైపున ఎక్కువగా పడుకోవడం మంచిది.

డాక్టర్ సింధు కుమారి , గైనకాలజిస్ట్
(మేధా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి భూపాలపల్లి)

తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవికాలం నేపథ్యంలో ఎండలు విపరీతంగా పెరుగుతున్నాయి. పిల్లలు ఉదయం 9గంటలు దాటిన తరువాత బయటకు రాకుండా ఇళ్లలోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లటి నీరు, జంక్ ఫుడ్ వంటి ఆహార పదార్థాలకు దూరంగా ఉంచాలి. రసాయనాలతో తయారు చేసిన శీతల పానీయాలను తాగించొద్దు. మధ్యాహ్న సమయంలో ఈత కొట్టొద్దు

జీడి తిరుపతి, పిల్లల వైద్య నిపుణులు (మల్లిక పిల్లల దవాఖాన, భూపాలపల్లి)

సరిపడా నీరు తాగాలి



ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల ప్రతి రోజు 5లీటర్లకు మించి నీటిని తాగాలి. కాకరకాయ, దోసకాయ, సోరకాయ వంటి నీటిశాతం ఎక్కువగా ఉండే పండ్లను తీసుకోవాలి. నూనె, మసాలాతో వంటకాలకు దూరంగా ఉండాలి. 60 ఏళ్ల పైబడిన వారు ఇంటికే పరిమితం కావాలి. వడదెబ్బకు గురైన వారిని వెంటనే నీడకు చేర్చి చల్లగా ఉండే పలుచని దుస్తులను వేయాలి.లూజుగా ఉండే కాటన్ దుస్తులను ధరిస్తే మంచిది.

డాక్టర్ రాం ప్రసాద్ రెడ్డి, జనరల్ ఫిజిషియన్
(సురక్ష మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి భూపాలపల్లి)

నల్ల పోచమ్మతల్లి సొసైటీకి ఇసుక రీచ్ నిర్వాహణ

వాడగూడెంలో పెసా గ్రామ సభ

ఇసుకరీచ్ అప్పగిస్తూ తీర్మానం

నవతెలంగాణ-మంగపేట

మండలంలోని వాడగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇసుక రీచ్ నిర్వహణ ఆ గ్రామానికి చెందిన నల్ల పోచమ్మ తల్లి ఇసుక కాంట్రాక్ట్ సొసైటీకి దక్కింది.వాడగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో రిజిస్టర్డ్ ఇసుక లేబర్ కాంట్రాక్టర్ సొసైటీల్లో ఇసుక రీచ్ నిర్వహణకు సొసైటీని గుర్తించడం కోసం వాడగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని పాలా యిగూడెం ఎస్టీ కాలనీలో వాడగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి వనజ ఆధ్వర్యంలో శుక్రవారం పెసా గ్రామసభ నిర్వహించారు.ఈ సభకు ఏటూరు నాగారం ఐటీడీఏ పెసా కో ఆర్డినేటర్ కొమురం ప్రభాకర్, మంగపేట తహశీల్దార్ తోట రవీందర్, ఎంపీ డీఓ భద్రునాయక్, ఎంపీఓ ఎం. మమత, రెవె న్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, వాడగూడెం గ్రామ ప్రత్యేక అధి.కారిణి కే.భావనలు ముఖ్య అతిథులుగా హాజ రయ్యారు. వాడగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో పగిడిద్దరాజు సమ్మక్క-సారక్క ఇసుక కాంట్రాక్ట్ సొసైటీ, శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఇసుక కాంట్రాక్ట్ సొసైటీలు ఉన్నాయి. పగిడిద్దరాజు సమ్మక్క -సారక్క ఇసుక కాంట్రాక్ట్ సొసైటీకి సంబ ంధించి ఆడిట్ కాకపోవడంతో కేవలం శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఇసుక కాంట్రాక్ట్ సొసైటీని మాత్రమే రిజి స్టర్డ్ ఇసుక లేబర్ కాంట్రాక్టర్ సొసైటీగా గుర్తించి ఉన్నతా ధికారులు ఉత్తర్వులు పంపినట్లు అధికారులు తెలి పారు. వాడగూడెం గ్రామ పంచాయతీ పరిధిలో మొత్తం 205మంది గిరిజన ఓటర్లు ఉన్నారు. గ్రామ సభ నిర్వ హించాలంటే గ్రామంలోని గిరిజన ఓటర్లలో మూ డవ వంతు (68)మంది హాజరు కావాలి. శుక్రవారం నిర్వహించిన పెసా గ్రామసభకు 118మంది హాజరయ్యారు. నిభందనల ప్రకారం కోరం ఉండడంతో అధికారులు గ్రామసభను నిర్వహించారు.సొసైటీని గుర్తించడం కోసం చేతులు ఎత్తి అభిప్రాయం తెలిపే పద్దతిలో అధికారులు ఓటింగ్ నిర్వహించారు. శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఇసుక కాంట్రాక్ట్ సొసైటీకి అనుకూలంగా 115 మంది తమ అభిప్రాయాలను వెల్లడించారు. దీంతో మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకు శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఇసుక కాంట్రాక్ట్ సొసైటీకి ఇసుక రీచ్ నిర్వహణ భాద్యతలు అప్పగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వాడగూడెం పరిధిలోని పాలాయిగూడెం (ఎస్టీ కాలనీ)లో నిర్వహించిన పెసా గ్రామ సభ సందర్భంగా ఎలాంటి గొడవలు, ఆందోళనలు జరగకుండా ఎస్సై సూరి బందోబస్తు నిర్వహించారు.





ఇఫ్తార్ విందుతో వెల్లివిరిసిన మతసామరస్యం

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు ధనసరి సూర్య

నవతెలంగాణ-మంగపేట

పవిత్ర రంజాన్ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులో మతసామరస్యం వెల్లి విరుస్తుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రాష్ట్ర నాయకులు ధనసరి సూర్య అన్నారు. గురువారం సాయంత్రం మండలానికి వచ్చిన సూర్య కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు టీ.వి హిదా యాతుల్లా ఆధ్వ ర్యంలో మండల కేంద్రంలోని మసీదులో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా హాజ రయ్యారు.ఈ సంద ర్భంగా సూర్య ముస్లిం సోదరులకు పండ్లు పంచ డంతో పాటు వారి నుండి పండ్లను స్వీకరించారు. ఒకరికొకరు అలైబలై చెప్పుకున్నారు. అనంతరం సూర్య మాట్లాడుతూ హిందూ ముస్లిం అనే భేదభావం ఇఫ్తార్ విందులో ఉండదని, మతసామరస్యానికి ప్రతికగా నిలుస్తూ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటి చెబుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మైల జయరాంరెడ్డి, చెట్టుపల్లి వెంకన్న అయ్యోరి యానయ్య మాసిరెడ్డి వెంకటరెడ్డి కర్రీ నాగేంద్రబాబు ఇస్సర్ ఖాన్ ఖాలీద్ మజీద్ కమిటీ సభ్యులు ఖలీల్ ఖరీం ఇజాజ్ పాషా సయ్యద్ హుస్సేన్ మహబూబ్ ఖాన్ భుట్టో సయ్యద్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



నిరంతర శ్రమ కషి ఫలితమే ఉత్తమ ఎస్ఐ

బీఎస్పీ ములుగు జిల్లా ఇన్చార్జి పశులాది ముఖేష్

నవతెలంగాణ-గోవిందరావుపేట

అనతికాలంలోనే పసర ఎస్ఐ కమలాకర్ ఉత్తమ ఎస్ఐగా ప్రశంసలందుకోవడం నిరంతర శ్రమ, నిర్విరామంగా చేసిన కషి ఫలితమేనని బీఎస్పీ ములుగు జిల్లా ఇన్చార్జి పసులాది ముఖేష్ అన్నారు. శుక్రవారం బీఎస్పి ములుగు జిల్లా అధ్యక్షుడు కడప రాజశేఖర్‌వర్మతో కలిసి ముఖేష్ ఎస్ఐ కమలాకర్‌ను సన్మానించారు. ఈ సంద ర్భంగా ముఖేష్ మాటా డుతూ పేద కుటుంబంలో పుట్టి పెరిగి ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యను అభ్యసించి పట్టుదలతో ఎస్ఐ ఉద్యోగం సాధించి విధి నిర్వహణలో రాణించి జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఉత్తమ ఎస్ఐగా ప్రశంసపత్రం, నగదు రివార్డును అందుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు.పసరలో బాధ్యతలు చేపట్టినప్పటి నుండి నేటి వరకు అనునిత్యం ప్రజల్లో ఉంటూ చట్టాలపై అవగాహన కల్పిస్తూ ఫ్రెండ్లీ పోలీస్‌గా వ్యవహరిస్తూ ఎలాంటి అక్రమాలు జరగకుండా బాధ్యతలు చేపడుతున్నారని అన్నారు. భవిష్యత్తులో కమలాకర్ పదోన్నతులను అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ అసెంబ్లీ అధ్యక్షులు కోకిల అజయ్ కుమార్, గంగ వేణి మణికాంత్ ముదిరాజ్, తరుణ్ నాయక్,జీడి ఏలియా, తదితరులు పాల్గొన్నారు.



నేడు మొక్కజొన్న రైతుల నష్టపరిహార నిర్ధారణ

నేరుగా రైతుల ఖాతాల్లో జమ

జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

నవతెలంగాణ-ములుగు

నేడు కంపెనీ యజమానాలతో కలిసి మొక్కజొన్న రైతుల నష్టపరిహారాన్ని నిర్ధారించి ఆ నష్టపరిహారాన్ని నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం తెలిపారు. ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం ,కన్నాయి గూడెం మండలంలలో సంభవించిన మొక్కజొన్న వైఫల్యంపై ఈ నెల 25న రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆధ్వర్యంలో రైతులు, అధికారులతో సమావేశం నిర్వహించి సమావేశంలో అందరి అభిప్రాయాలు సేకరించి రైతులకు త్వరితంగా స్వాంతన చేకూర్చేలా పలు సూచనలు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న రైతు ఇంటిని త్రీ మెన్ కమిటీ సందర్శించి నివేదికను తయారు చేసి జిల్లా అడ్మినిస్ట్రేషన్‌కి పంపించినట్లు తెలిపారు. దీంతో పాటుగా మృతునికుటుంబానికి సత్వర ఆర్థికసాయం రూ.25వేలు ట్రైబల్ వెల్ఫేర్ ఫండ్ ద్వారా జీవోఎంఎస్ నెంబర్ 70ప్రకారం మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్ఎఫ్బిఎస్. స్కీం కింద రూ.20వేల ఆర్థిక సహాయం చేసేందుకు చేయూత పోర్టల్ ద్వారా అప్డేట్ చేసినట్లు తెలిపారు. పంట నష్టానికి సంబంధించిన నష్టపరిహారాన్ని నిర్ధారించేందుకు నేడు (శనివారం)కంపెనీ ప్రతినిధులు, ఆర్గనైజర్స్‌తో కలెక్టరేట్‌లో మీటింగ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో నష్టపోయిన రైతుల ఖాతాల్లో జమ చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. నష్టం సంభవించిన మండలాల్లో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేసి ప్రతి కుటుంబంలోని వ్యక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి సరిపడా మందులను కూడా పంపిణీ చేస్తామని తెలిపారు.



ఇండియన్ ఆర్మీకి పంకెన గ్రామ యువకుడి ఎంపిక

నవతెలంగాణ మహదేవపూర్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం పంకెన గ్రామానికి చెందిన బొచ్చు లక్ష్మయ్యయాదవ్-పుష్పలత కుమారుడు బొచ్చు. రాకేష్ యాదవ్ ఇటీవలే ప్రక టించిన అగ్నివీర్ ఆర్మీ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించి మెరిట్ లిస్టులో ఆర్మీ జనరల్ డ్యూటీ క్యాట గిరిలో ఎంపిక అయ్యాడు. రాకేష్ యాదవ్ ప్రస్తుతం హన్మకొండలోని వాగ్దేవి కాలేజీలో డిగ్రీ చివరి సంవ త్సరం చదువుతున్నాడు. ఎన్‌సీసీలో శిక్షణ పొందాడు. రాకేష్ ప్రాథమిక విద్యను పంకెన, హైస్కూల్ విద్యను మంథనిలో, కాలేజీ విద్యను కరీంనగర్‌లో ప్రభుత్వ విద్యా సంస్థలలో చదివారు.ఆర్మీలో ఉద్యోగం సాధించిన రాకేష్ యాదవును గ్రామస్తులు, బంధువులు, మిత్రులు అభినందించారు.



ప్రశాంతంగా కొనసాగుతున్న పది పరీక్షలు

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

పదవతరగతి రసాయన శాస్త్ర పరీక్ష శుక్రవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగిందని డీఈఓ రమేష్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 41 పరీక్ష కేంద్రాల్లో 6238 మంది విద్యార్థులకు 6233 మంది హాజరయ్యారని, 5గురు విద్యార్థులు గైర్హాజరు కాగా 99.92 శాతం విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రైవేట్ గా పరీక్ష రాసే ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థి ఒకరు పరీక్షకు హాజరైనట్లు పేర్కొన్నారు. నిలిగొండ పరీక్ష కేంద్రాన్ని డిఇఓ తనిఖీ చేయగా తనిఖీ బృందాలు 11 పరీక్ష కేంద్రాల్లో తనిఖీ చేసినట్లు వివరించారు.

పేదలకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ అండ

నవతెలంగాణ-పాలకుర్తి



పేదలకు, అనాధలకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్ యతిపలి శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం పాలకుర్తి దళిత కాలానికి చెందిన గాయల మధు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి 25కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందజేశారు. పేద కుటుంబాలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ జీడి హరీష్, కోశాధికారి ఒగ్గె కుమారస్వామి, ట్రస్ట్ సభ్యులు పెండ్లి భాస్కర్, తాళ్లపెల్లి రత్నాకర్, గాదేపాక భాస్కర్, మతుడి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-బచ్చన్నపేట

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టుకున్నట్లు ఎస్ఐ ఎస్కే.హమీద్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెట్రోలింగ్‌లో భాగంగా మండలంలోని సదాశివపేట నుండి ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. మండలంలోని నక్క వాని గూడెం కు చెందిన పంబల నాగరాజు, రాములు ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-లింగాలఘనపురం



మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు కస్తూరి వేణుగోపాల్ రావు తల్లి ప్రేమబాయి గురువారం రాత్రి మరణించగా స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి. రాజయ్య భౌతికకాయంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరి వెంట ఎదునూరి వీరయ్య ,భాగ్యలక్ష్మి, కేమిడి వెంకటేష్, చంద్రయ్య యాదగిరి, తదితరులు పాల్గొన్నారు. ప్రేమబాయి, వేముల ముత్తయ్యల మృతదేహాన్ని శుక్రవారం ప్యాట రవి సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యలను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ పరామర్శలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు కుంటి రాంచందర్, గట్టగల్ల యాదగిరి, కుంటి బిక్షపతి, గండి పవన్, వేముల పవన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల జోలికొస్తే సహించేది లేదు

నవతెలంగాణ-పాలకుర్తి



గిరిజనుల జోలికి వస్తే ఊరుకునేది లేదని బమ్మెర -2 మాజీ ఎంపిటిసి బానోతు చత్రు నాయక్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో గల బిఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గిరిజనులు అంటేనే అగ్రవర్ణాలు అలుసుగా చూస్తున్నారని వ్యక్తిగత సమస్యల పట్ల అగ్రవర్ణాలు జోక్యం చేసుకొని గిరిజనులను దుర్భాషలాడుతూ దాడులకు పాల్పడుతున్నారన్నారు. గిరిజనులకు న్యాయం చేయకుండానే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుండడంతో ఇటీవలే గిరిజన యువకుడు బలయ్యాడని ఆవేదన వ్యక్తంచేశారు. అగ్రవర్ణాల ఇండ్లను ముట్టడించేందుకు వెనుకాడబోమని ప్రతి దాడులకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే పేరు చెప్పుకుంటూ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న యాకాంతరావు, రాఘవరావులు తమ పద్ధతులు మార్చుకోవాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో బీఆర్ఎస్ అనుబంధ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు ధారావత్ యాకూబ్ నాయక్, గిరిజన నాయకులు మహేందర్ నాయక్, మాజీ సర్పంచ్ బానోతు మహేందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నాగరాజు

నవతెలంగాణ-లింగాలఘనపురం



హైదరాబాద్‌లో సీఎం ఎనుముల రేవంత్ రెడ్డిని పెండింగ్ పాల బిల్లుల గురించి వివిధ జిల్లాల నుండి అధ్యక్షులు, జనగామ జిల్లా ఉపాధ్యక్షులు దామెర నాగరాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారు వెంటనే ఒకటిరెండు రోజుల్లో పెండింగ్ బిల్లులు చెల్లిస్తామని పేర్కొన్నారు. దీంతో ముఖ్యమంత్రికి పాల ఉత్పత్తి దారులు, అధ్యక్షులు ధన్యవాదాలు తెలిపారు.

సమాజంలో అందరూ సమానమే : ఎంఈవో

నవతెలంగాణ-పాలకుర్తి



సమాజంలో ఆడ, మగ తేడా లేకుండా అందరూ సమానమేనని మండల విద్యాశాఖ అధికారి పోతుగంటి నర్సయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో డిఆర్ డి ఎ ఆధ్వర్యంలో మండల మహిళా సమైక్య సహకారంతో సైబర్ నేరాల పట్ల, సమానత్వం పట్ల విద్యార్థినీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఎం పిట్టల నరేందర్ తో కలిసి నర్సయ్య మాట్లాడుతూ ఆన్లైన్ మోసాలతో పాటు సైబర్ మోసాలతో అనేకమంది ఆర్థికంగా నష్టపోతున్నారని తెలిపారు. నేరాలను నివారించేందుకు విద్యార్థినీలు ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. మాదకద్రవ్యాలు, డ్రగ్స్ లాంటి మత్తు పదార్థాలను వాడకుండా నివారించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. చేసే పనిలో ఎక్కువ తక్కువ అనే తేడా ఉండకూడదు అని సమాజంలో ప్రజలందరూ సమానమేనని గుర్తించాలని తెలిపారు. ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. మోసాల పట్ల, నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండల సమైక్య ఆధ్వర్యంలో కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీల కారుపోతుల వెంకటేశ్వర్లు, అనురాధ, శోభ, యాదగిరి, వెంకన్న లతోపాటు కస్తూర్బాగాంధీ గురుకుల బాలికల పాఠశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ హైమవతి, జెండర్ కమిటీ సభ్యులు అనుముల అనూష , విఓఎలు పెనుగొండ మంజుల, రాపర్తి మంజుల తదితరులు పాల్గొన్నారు.

కోటగుళ్లలో ఆలయ ధర్మకర్త పూజలు

నవతెలంగాణ-గణపురం

కాకతీయుల కళాక్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళలో శుక్రవారం మాస శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ ధర్మకర్త అట్లూరి వెంకట లక్ష్మినరసింహారావు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారిని సాదరంగా ఆహ్వానించి గణపతి, నందీశ్వరుడు, గణపేశ్వరునికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం కోటగుళ్ల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలు పూలమాలతో ఘనంగా సన్మానించి ఆశీర్వచనాలు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

అధైర్య పడొద్దు అండగా బీఆర్ఎస్

మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

నవతెలంగాణ-మల్హర్‌రావు

అధైర్య పడొద్దు బీఆర్ఎస్ పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మదుకర్ అన్నారు. మండలంలోని ఎడ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ వాలా సంధ్య-యాదగిరావు తల్లి వాలా రమాదేవి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకుని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించి, ఓదార్చారు. అనంతరం మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కుంభం రాఘవ రెడ్డి,మాజీ జెడ్పిటిసి గొనె శ్రీనివాసరావు,మాజీ ఎంపిపి యాదండ్ల లక్ష్మీ రామన్న యాదవ్, యూత్ అధ్యక్షుడు జాగరి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి భూమిపూజ

నవతెలంగాణ-కొడకండ్ల



నిరుపేదల అభివద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను తప్పకుండా అమలు చేయడం జరుగుతుందని అందులో భాగంగానే ఆరు గ్యారెంటీల్లో ఒకటైన ఇందిరమ్మ గృహకల్పన పథకంలో భాగంగా శుక్రవారం మండలంలోని రెవెన్యూ విలేజ్ మొండ్రాయి శివారు నీలిబండ తండాను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. నిలువండ తండాలో రాత్రి 8 గంటల సమయంలో మొదటి విడత లో ఎంపిక చేసిన 46 మంది లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న రాద్ధాంతాన్ని ప్రజలు నమ్మొద్దని ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను ఒకదాని తర్వాత ఒకటి సీఎం అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మండల నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి

- మసీదుల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి చొరవ
- ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

నవతెలంగాణ-పాలకుర్తి



మైనార్టీల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కషి చేస్తుందని ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల బషారత్ గార్డెన్ లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో డి ఎస్ వెంకన్న తో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ మతసామరస్యానికి ఇఫ్తార్ విందు దోహదపడుతుందని తెలిపారు. ఇఫ్తార్ విందులతో ముస్లింల ఐక్యతకు దోహదపడుతుందన్నారు. హిందూ, ముస్లింలు సోదర భావంతో ఉన్నప్పుడే రంజాన్ పర్వదినానికి స్ఫూర్తిదాయకమన్నారు. మజీదుల అభివద్ధికి, మజీదుల ప్రహరీ గోడల నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. ముస్లింలను అన్ని రంగాల్లో అభివద్ధి చేసేందుకే సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దష్టి పెట్టారని తెలిపారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ముస్లింలకు అందించేందుకు ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు ఎండి మదర్, మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండి సలీం, ఎండి నజీర్, నాయకులు ఎండి యాకూబ్, ఎండి అబ్బాస్ అలీ లతోపాటు ముస్లింలు ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో ఐలమ్మ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లావుడియా మంజుల, తహసిల్దార్ పొట్టబత్తుల శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యానారాయణ, పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి గౌడ్, ధరావత్ సురేష్ నాయక్, నల్ల శ్రీరామ్, కొడకండ్ల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, దేవస్థాన మాజీ చైర్మన్ చిలువేరు కష్ణమూర్తి, కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి బైరు భార్గవ్, పాలకుర్తి, తీగారం మాజీ సర్పంచులు వీరమనేని యాకాంతరావు, పోగు శ్రీనివాస్, మాజీ ఎంపీపీ గద్దం యాకసోమయ్య పట్టణ అధ్యక్షులు కమ్మగాని నాగన్న గౌడ్, నాయకులు పెనుగొండ రమేష్, చిలువేరు సంపత్, గోనె మహేందర్ రెడ్డి, బండిపెల్లి మనమ్మ, బైకానీ ఐలేష్ యాదవ్ లతోపాటు పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల మండలాల ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

రైతులపై ప్రభుత్వం అణిచివేత, నిర్బంధం, దాడులు ఆపాలి



- కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రాత పూర్వక హామీలు అమలు చేయాలి
- తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చందునాయక్
- సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-జనగామ

రైతులపై కేంద్ర బిజెపి పాలనలో చేస్తున్న పంజాబ్ ప్రభుత్వ అణిచివేత, నిర్బంధం, దాడులు ఆపాలి అని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా చందునాయక్ డిమాండ్ చేశారు. సరిహద్దుల్లో రైతులపై చేసిన దాడులకు నిరసనగా జనగామ జిల్లా కేంద్రం చౌరస్తా వద్ద శుక్రవారం సంయుక్త కిసాన్ మోర్చా తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చందునాయక్ మాట్లాడుతూ ఢిల్లీ సరిహద్దుల్లో రైతులపై చేస్తున్న దాడులు, నిర్బంధాలను ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం గతంలో దేశ రైతాంగానికి ఇచ్చిన రాత పూర్వక హామీలను అమలు చేయాలన్నారు. రెండవ దశ ఉద్యమం చేస్తున్న పంజాబ్, హర్యానా రైతులను సరిహద్దుల్లో నిలువరించి విదేశీ ఉగ్రవాదులతో ప్రయోగించే ఆధునిక పద్ధతిలో రైతులపై దాడులు చేయడం భారత సమాజం ఖండించాలని కో రారు. గతంలో రైతుల చర్చల్లో ఒప్పందం చేసుకున్న నిర్ణయాలు అమలు చేయకపోవడంతో రైతులు తిరిగి రెండో దశ ఉద్యమం ప్రారంభించారని తెలిపారు. శాంతియుతంగా ఆందోళన కూడా అవకాశం లేకుండా కేంద్ర ప్రభుత్వం రైతులపై డ్రోన్స్ ద్వారా, భాష్ప వాయువులు, టియర్‌గ్యాస్ ప్రయోగించడం వంటివి కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్‌చేశారు. వెంటనే రైతులపై దాడులు భాష్పవాయు ప్రయోగాలు ఆపకపోతే దేశమంతటా రైతులను ఐక్యం చేసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా రైతులు పండించే అన్ని రకాల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం గిట్టుబాటు ధరల గ్యారెంటీ చట్టం చేయాలని కోరారు.

దేశవ్యాప్తంగా రైతు రుణాలన్నింటిని ఏకకాలంలో మాఫీచేయాలని, కిసాన్ సంబంధించిన పథకానికి సంవత్సరానికి రూ.20వేలు ఇవ్వాలన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని మోడీ ప్రభుత్వం చెప్పి రైతు వ్యతిరేక నల్ల చట్టాలు తీసుకువచ్చే ప్రయత్నం చేసిందన్నారు. మార్కెట్లో ప్రైవేటీకరణ చేయడం కోసం మార్కెట్ ముసాయిదా చట్టం అదేవిధంగా విద్యుత్ సవరణ చట్టం, ఫసల్ బీమా యోజనలు రైతులకు అనుకూలంగా సవరించకుండా కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడే విధంగా అమలు చేయడం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మోడీ ప్రభుత్వం రాతపూర్వక హామీలను అమలు చేయని కారణంగా రెండవ దశ రైతాంగ ఉద్యమానికి శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని గుర్తించారని తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా, రాష్ట్రా ల్లో బిజెపి రైతు వ్యతిరేక విధానాల పై ఉద్యమాలు ప్రారంభమయ్యాయని అన్నా రు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పెద్దఎత్తున కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు నిర్మిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ జిల్లాబాధ్యులు కుర్ర రవీందర్‌గౌడ్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మంగ బీరయ్య, జిల్లా సహాయ కార్యదర్శి రామావత్ మీట్యా నాయక్, పట్టణ అధ్యక్షులు ఉర్సులకుమార్, మంద్రా బండయ్య, కర్రె సత్యనారాయణ, కర్రె సిద్ధి మల్లయ్య, నీలం బాలరాజు, సులోచన, సోని పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి

నవతెలంగాణ-బచ్చన్నపేట



రాష్ట్రంలో కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న 5 లక్షల కుటుంబాల సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.5వేల కోట్ల రూపాయలు కేటాయించాలని కల్లుగీత కార్మి సంఘం రాష్ట్ర కార్యదర్శి బూడిది గోపి డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎస్‌విఫంక్షన్‌హాల్లో కల్లుగీత కార్మిక సంఘం మండల సమావేశం మండల అధ్యక్ష కార్యదర్శులు యాదండ్ల పరంధామ పోతుగంటి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతి థులుగా రాష్ట్ర కార్యదర్శి బూడిద గోపి జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్నే వెంకటమల్లయ్య హాజరుకాగా గోపి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో గీత కార్మికుల సంక్షేమానికి రూ.68 కోట్లు మాత్రమే ప్రకటించారు. వీటితో గీతా కార్మికుల అభివృద్ధి సంక్షేమంఎలాజరుగుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తు న్నాం. రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న ఎక్స్ గ్రేషియా రూ.12 కోట్లు విడుదల చేయాలని, వృత్తులలో అత్యంత ప్రమాదకరమైన వృత్తి కల్లుగీత వృత్తి అని... ప్రమాదం అని తెలిసినా కల్లుగీత కార్మికులు తమ జీవనోపాధి కోసం గత్యంతరం లేని పరిస్థితులలో... కల్లుగీత వృత్తిలో కొనసాగుతూ వృత్తి చేస్తున్నారు. ప్రమాదవశాత్తు తాటి చెట్ల పై నుండి పడి తీవ్ర గాయాల పాలైన పర్మినెంట్ డిజబిలిటి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అనంతరం లిబాల్నే వెంకటమల్లయ్య గౌడ్‌లి మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్నఎక్స్ గ్రేషియాలు రూ.1.55 కోట్లు మంజూరై సంవత్సరం గడిచిన ఇప్పటివరకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడం వల్ల అట్టి కుటుంబాలకు ఎక్స్ గ్రేషియా డబ్బులు అందలేదని దీంతో ఆ కుటుంబాలు తీవ్రఅవస్థలు పడుతున్నారని వెంటనే ప్రభుత్వం ఎక్స్ గ్రేషియా నిధులను విడుదల చేసి... క ల్లుగీత కార్మిక కుటుంబాలను ఆదుకోవాలని కోరుతు న్నామనిచెప్పారు. అదేవిధంగా కల్లుగీత వత్తిలో ప్రమాదాలు నివారించడానికి నూతనంగా ప్రవేశపె ట్టిన కాటమయ్య రక్షణ కిట్టులను జిల్లాలోని 11వేల మం ది సభ్యత్వం కలిగి ఉన్నారు... 680 మందికి ఇచ్చారు... మిగతా కల్లుగీత కార్మికులకు తక్షణమే అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఎక్స్ గ్రిషియా నిధుల మంజూరులో జాప్యం చేస్తే... వచ్చే నెల 20న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఎక్స్ గ్రేషియా బాధితులతో నిరసన కార్యక్రమం పెద్ద ఎత్తున చేపడతామని తెలిపారు.. ఈ సమావేశంలో కేజీకేఎస్ జిల్లా కమిటీ సభ్యులు బండపల్లి శంకరయ్య , బైరగోని వెంకటయ్య,, మనమైన వెంకటేష్ గౌడ్, కేజీకేఎస్ మండల నాయకులు బైరగోని బలరాములు, సిద్ధులు, అంజయ్య సత్తయ్య, యాదండ్ల శ్రీనివాస్, దూడల ప్రశాంత్, బత్తిని రాజు, బెజ్జం రమేష్, తాళ్లపల్లి ఆంజనేయులు, బుసిగంపల చంద్రయ్య, ముసిని వెంకటేష్, మహేష్, రాములు, శ్రీరాములు, ఉప్పలయ్య, కుమార్, చంద్రయ్య, కోళ్ల రమేష్, నర్మట కనుకయ్య, రాజ, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏకశిలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు





నవతెలంగాణ-ఐనవోలు

హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం, ఖమ్మం హైవెలోని ఏకశిల సి. బి. ఎస్ఇ అండ్ స్టేట్‌స్కూల్స్‌లోని ప్రీ ప్రైమరీ విద్యార్థులు గ్రాడుయేషన్ డే సెలబ్రేషన్ లో అద్భుతమైన ప్రతిభ పాటవాలు కనబరిచి, అందరి మన్ననలు పొందారని ఏకశిల విద్యా సంస్థల అధినేత డా. గౌరు తిరుపతి రెడ్డి తెలిపారు. శుక్రవారం పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏకశిల విద్యా సంస్థల చేర్మన్ డా. గౌరు తిరుపతి రెడ్డి లేలేత వయసులోనున్న చిన్నారును అభినందించి, గోల్డ్ మెడల్ , అప్రిసియేషన్ సర్టిఫికెట్స్ ప్రధానం చేశారు. అనంతరం మాట్లాడుతూ చిన్నారుల్ని తక్కువ అంచనా వేయొద్దని, ఇపుడు పిల్లలు 5జి జ్ఞానంతో పుడుతున్నారని, ఇలాంటి వేడుకలు జరిపి చిన్న పిల్లల్లో దాగిన వివిధ కలల్ని వెలికితీసి, ప్రపం చానికి చాటా లన్నారు.

ప్రిన్సిపాల్ ఎండి. బాబా ప్రసంగిస్తూ భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా ప్రీ ప్రైమరీ పిల్లల్ని సైతం ఆట, పాట, మాటల్లో తర్ఫీదు ఇవ్వాలని, ఆ మహా సంకల్పంతో చేసిన కార్యక్రమమే ఇదన్నారు.

గ్రాడుయేషన్ డే సెలబ్రేషన్ చేద్దామని ప్రణాళిక తెలియజేయగానే ముందుకు వచ్చి శ్రమతో పిల్లల్ని కార్యోన్ముఖులుగా తయారుచేసిన యు. కె. జి. మదర్ టీచర్ జయ కుమారి, ప్లే వే ఇన్చార్జ్ నసీమాబేగం, వి. అనూష, కొరియోగ్రాఫర్ కందికరాజు తదితరులను ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ కె.రవి కిరణ్, రెసిడెన్షియల్ ఇన్‌చార్జ్ కొండేటి శ్రీనివాస్, అమర్, అరుణ్, పిఈటిలు, ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

'అండర్‌పాస్‌బ్రిడ్జి' దీక్షలకు ఎస్ఎఫ్ఐ మద్దతు



నవతెలంగాణ-జనగామ

జనగామ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద నిర్మాణం జరుగుతున్న బైపాస్ రోడ్ లో అండర్పాస్ బ్రిడ్జి నిర్మించి ప్రజలు నాదుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో గత 63 రోజులుగా నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు. మామిడాల రమేష్ ఆధ్వర్యంలో లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఉపాధ్యక్షులు లవ కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి యాకన్న రాథోడ్ పాల్గొని తమ మద్దతు తెలిపి మాట్లాడారు. అభివద్ధి పేరుతో రోడ్డు మూసివేసి సుమారు 10,000 మందికి ఉపయోగపడే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టకపోవడం సరైన కాదన్నారు. ఇప్పటికే అధికారుల దష్టికి ఈ విషయం తీసుకపోవడంతో పాటు అన్ని రాజకీయ పార్టీల సహకారం కూడా కోరుతూ అదే సందర్భంగా భువనగిరి నియోజకవర్గ పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి గారికి కూడా వినతిపత్రం ఇచ్చి బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగే విధంగా కషి చేయాలని కోరడం జరిగింది అన్నారు. అయినప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం నుంచి స్పందన లేకపోవడం సరి అయింది కాదన్నారు. ఇప్పటికైనా ఎంపీ తోపాటు ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారులు స్పందించి అండర్ ప్రాస్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ఆర్య, సందీప్, రమేష్ , మానిత్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలి

- కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి బొట్ల శ్రావణ్



నవతెలంగాణ-జనగామ

గత కొన్ని ఏళ్లుగా ఎస్సీ నిరుపేదలకు అందని ఎస్సీ కార్పొరేషన్ రుణాలను మంజూరు చేయాలని కేవీపీఎస్ పట్టణ కార్యదర్శి బొట్ల శ్రావణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జనగామ పట్టణంలోని 30 వ, 13 వ వార్డు లలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రాగల రామ నరసయ్య అధ్యక్షత నిర్వహించిన కార్యక్రమంలో బొట్ల శ్రావణ్ హాజరై మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన నాటినుండి నేటి వరకు ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పూర్తిగా ప్రజలకు అందకుండా దూరమయ్యాయి అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులకు అందించవలసిన స్కీములన్ని నిలిపివేశారన్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాల వల్ల దళితులు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ సెంట్రింగ్ పని, వెల్డింగు, ఆటోలు, చిన్న చిన్న కార్లు కార్పొరేషన్ రుణాల ద్వారా తీసుకొని కుటుంబాలు పోషించుకునేవారు అని తెలిపారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రుణాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు . దళిత బంధుతో దళితులకు ఏ విధమైన న్యాయం జరగలేదు అని స్పష్టం చేశారు. కాబట్టి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు స్కీముల ద్వారా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో కెవిపిఎస్ నాయకులు యాదగిరి, పాము శ్రీకాంత్, శ్రీను, శ్రీధర్, సోను తదితరులు పాల్గొన్నారు.

గట్టు మల్లన్న ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-వేలేరు



దాదాపు 15 లక్షల చేరువలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆదాయం వివరాలు వెల్లడించిన నాగేశ్వర రావు వెండిది హుండీలోవేసి, బంగారి కోర మీసమని వైరల్ చేసుకున్న ఒక భక్తుడి ఉధంతం. ప్రతి సంవత్సరం క్రమక్ర మంగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల హుండి ఆదాయం పెరుగుతుందని ఆలయ ఈవో అద్దంకి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం గట్టు మల్లన్న ఆలయ ప్రాంగణంలో భక్తులు సమర్పించిన కానుకల ఆదాయాన్ని డివిజన్ ఇన్స్పెక్టర్ డి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో లెక్కించారు. మహాశివరాత్రి పర్వదినం నుండి నేటి వరకు అనగా 35 రోజుల హుండీ లెక్కింపు 2,88,738 , వివిధ రకాల టికెట్లు రూపంగా రూ.12,01,145 రాగా మొత్తంగా రూ.14, 89,883లు ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపు కార్యక్రమంలో అర్చకులు మహేష్ శర్మ, ఒగ్గు పూజారులు, నాయి బ్రాహ్మణులు, శ్రీ లక్ష్మి వెంకటేశ్వర సేవా సమితి సభ్యులు,సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. వెండిది హుండీలో వేసి, బంగారి కోరమీసమని వైరల్ చేసుకున్న ఒక భక్తుడి ఉధృంతం ఒక భక్తుడు హుండీలో బంగారు పూతపూసివెండి కోర మీసం వేసి బంగారి కోరమీసమని సోషల్ మీడియాలో వైరల్ చేసుకున్న వైనం హుండీ లెక్కింపుతో తేటతెల్లమైంది.

మాజీ సర్పంచ్ ఆర్థిక చేయూత

నవతెలంగాణ-బచ్చన్నపేట

గత మూడేళ్ల నుండి, పార్టీలతో సంబంధం లేకుండా, కులమతాలకు అతీతంగా, ప్రతి రంజాన్ మాసములో.. ప్రతి ముస్లిం ఇంటికి పండుగకు కావలసిన సామాగ్రిని అందజేస్తూ తన సహాయ సహకారాలు అందిస్తున్న మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ నల్లగోని బాలకిషన్‌కు ముస్లిం మైనార్టీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పదవి విరమణ సన్మానం

నవతెలంగాణ-మహదేవపూర్

మండలంలోని పంచాయతీరాజ్ శాఖ ఆఫీసులో డ్రైవర్‌గా పని చేసి ఇటీవల పదవి విరమణ పొందిన సందర్భంగా శుక్రవారం తజొద్దీన్‌కు తెలంగాణ ముస్లిం హక్కుల పోరాట సమితి, కలిమా మస్జిద్ కమిటీ తరపున శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీఎం హెచ్పిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు అమీన్, మండల అధ్యక్షులు ముజాహిద్, కోశాధికారి ఖమర్,కలీమ మస్జిద్ క్యాషియర్ అజ్మత్‌అలీ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సహకార బ్యాంకు సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-మహదేవపూర్

మండల కేంద్రంలోని సహకార బ్యాంకు కార్యాలయంలో శనివారం ఉదయం 11గంటలకు సంఘం చైర్మన్ సల్ల తిరుపతిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని సీఈవో కుమ్మరి రాజబాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు సభ్యులు గౌరవ సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం ఆకస్మిక తనిఖీ..

నవతెలంగాణ-గూడూరు



మండలంలోని దామరవంచ గ్రామంలో తెలంగాణ గిరిజన ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ, బాలుర వసతి గృహాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా వసతి గృహంలోని పరిసరాలను కలియతిరిగి పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పక్కాగా డైట్ మెనూ పాటించాలని, షెడ్యూల్ ప్రకారం పిల్లలకు ఆరోగ్య పరిక్షలు నిర్వహించాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట కాలేజీ ప్రిన్సిపాల్ హేమంత్‌నాయక్ , మండల పరిషత్ అభివృద్ధి అధికారి వీరస్వామి , మండల పంచాయతీ విస్తరణ అధికారి సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.

వెటర్నరీ డాక్టర్‌ని నియమించాలి: సీపీఐ(ఎం)

నవతెలంగాణ-మరిపెడ



మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామంలో ఉన్నటువంటి వెటర్నరీ వైద్య దావఖానకు వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలని సీపీఐఎం) మండల కార్యదర్శి గుండ గాని మధుసూదన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చిలంచర్ల గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి గుండ గాని మధుసూదన్ మాట్లాడుతూ చిల్లంచర్ల గ్రామంలో పశు వైద్య డాక్టర్ లేక దాదాపు సంవత్సరకాలం అవుతు ందన్నారు. గ్రామానికి వచ్చిన సీపీఐ(ఎం) బృందం రైతులని నేరుగా అడిగి ఈ సమాచారం తెలుసుకోవడంతో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పశు సంవర్ధక శాఖ, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి వైద్య అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు చెన్నబోయిన వెంకన్న, రాంబాబు పగింఢ్ల శ్రీను, సారంగం సందు ఉప్పలయ్య, ధనుంజయ్ లక్కీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించాలి



- విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయించాలి
- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి

నవతెలంగాణ-మహబూబాబాద్

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యారంగాన్ని బలోపేతం చేయుట కోసం బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయించాలని, ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యాలయం మహబూబాబాద్‌లో ఎ.మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చావ రవి మాట్లాడారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం 15 శాతం కేటాయించాలని క్రమంగా 20 శాతంకు పెంచాలని, వచ్చే విద్యా సంవత్సరం నుంచే ప్రాథమిక పాఠశాలల బలోపేతం కోసం ప్రత్యేక కేంద్రీకరణ జరగాలని, పూర్వ ప్రాథమిక తరగతులను ప్రారంభించి, ప్రతి తరగతికి ఒక టీచర్ చొప్పున 5గురు టీచర్లు, ఒక హెచ్‌ఎం ఉండేలా తెలుగు, ఇంగ్లీష్ మీడియంలను సమాంతరంగా నిర్వహించాలని కోరారు పాఠశాలల పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని, వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు సెలవులు ఎక్కువ, ఉపాధ్యాయుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చదవడంలేదని ఆరోపిస్తూ చట్ట సభల్లో చర్చ జరగడం పట్ల విచారం వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలను ప్రభుత్వం నియంత్రించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తే ఉపాధ్యాయులతో పాటు అందరి పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకుంటారని స్పష్టం చేశారు. విద్యా శాఖ వెకేషన్ డిపార్టుమెంట్ కనుక మిగిలిన ఉద్యోగుల కంటే కొన్ని సెలవులు అదనంగా ఉంటాయని ఆమేరకు ఇతర ఉద్యోగులకు సంపాదిత సెలవులు అదనంగా ఇస్తారని, ఈవిషయం తెలిసికూడా ప్రభుత్వాధినేతలు ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం సమంజసం కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం గురించి తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. పెండింగ్ బిల్లులు, బకాయి పడిన నాలుగు వాయిదాల డీఎలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ నివేదిక తెప్పించుకుని సంఘాలతో చర్చించి అమలు చేయాలని, ఆరోగ్య సంరక్షణ పథకం అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఎంప్లాయీస్ జేఏసీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామన్నారు. ఈసమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సామ మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్.యాకూబ్, ఉపాధ్యక్షులు నామ వెంకటేశ్వర్లు, ఎన్.స్వప్న, కోశాధికారి కె.నాగమల్లయ్య, జిల్లా కార్యదర్శులు జి.భద్రునాయక్, జి.వివేక్, పి.మంజుల, ఎన్.జనార్ధనాచారి, బి.హరినాయక్, ఆడిట్ కమిటీ కన్వీనర్ జి.సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలి



- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి
- నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఝాన్సీరెడ్డి

నవతెలంగాణ-పెద్దవంగర:

సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను పార్టీ శ్రేణులు తిప్పి కొట్టాలని పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ హనుమండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సాయిగార్డెన్‌లో ఎంపీటీసీ క్లస్టర్, గ్రామ కో-ఆర్డినేటర్స్ సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈసందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నాయకులు ఎన్ని ఇబ్బందులు పెట్టినా పార్టీ కోసం సోషల్ మీడియా నాయకులు అండగా నిలిచారని గుర్తు చేశారు. వారి త్యాగాల ఫలితమే నేడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొనే కార్యకర్తలకు సముచిత స్థానం కల్పిస్తామన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృత స్థాయిలో ప్రచారం చేపట్టాలని సూచించారు. రాబోయే స్థానిక సంస్థల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో దూసుకుపోతుందని కితాబిచ్చారు. పాలకుర్తి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈకార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షుడు హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, సీనియర్ నాయకులు నెహ్రూ నాయక్, మండల కో-ఆర్డినేటర్లు గంజి విజయ్ పాల్ రెడ్డి, రెంటల గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రంగు మురళీగౌడ్, ప్రధాన కార్యదర్శి పొడిశెట్టి సైదులుగౌడ్, మహిళా అధ్యక్షురాలు చిలుక దేవేంద్ర, నాయకులు బానోతు గోపాల్‌నాయక్, బీసు హరికృష్ణ, బానోతు సీతారాంనాయక్, దాసరి శ్రీనివాస్, అనపురం శ్రీనివాస్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

జల బాండాగారానికి పొంచి ఉన్న ముప్పు..!

- బెంబేలెత్తుతున్న రైతాంగం
- పట్టించుకోని అధికారులు.. ప్రజా ప్రతినిధులు..





నవతెలంగాణ-బయ్యారం:

కాకతీయుల కాలం నాడు నిర్మించబడి వందల, వేల ఏండ్ల చరిత్ర కలిగిన బయ్యారం పెద్ద చెరువుకు ప్రమాదం పొంచి ఉన్నది. ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన బయ్యారం, గార్ల మండలాలలోని వేలాది పంట పొలాలకు నీరందించే బయ్యారం పెద్ద చెరువు మీడియం ఇరిగేషన్‌గా ప్రభుత్వం గుర్తించినా ఆలనాపాలనా లేక పోవడంతో ప్రతి ఏటా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువు నిండుతూ భారీ స్థాయిలో నీటి మట్టం చేరడంతో బయ్యారం చెరువుకు ఉన్న ప్రధాన అలుగులకు బుంగలు పడి నీరు ప్రవహిస్తున్న అలుగుపై ఉన్న కాంక్రీట్ పూర్తిగా నీటి ప్రవాహానికి కొట్టుకుపోయి అలుగు తెగిపోయే పరిస్థితికి చేరుకుంది. బయ్యారం పెద్ద చేరువు పూర్తి స్థాయి నీటి మట్టం 16 అడుగులకు నీరు అలుగు పడుతుండగా ప్రస్తుతం 15 అడుగుల నీటి మట్టంలో కాకతీయులు నిర్మించిన పాత అలుగు భారీ స్థాయిలో బుంగపడటం వల్ల కొత్త అలుగుకి నీరు ప్రవహించి అక్కడి నుంచి లీకుల ద్వారా ఎర్ర కాలువ ద్వారా గార్ల పెద్ద చెరువుకు నీరు భారిగా చేరుకుంటుంది. అలుగు చుట్టూ ఉన్న సైజు రాయితో నిర్మించిన గోడలు పూర్తి స్థాయిలో నేలమట్టమై దర్శనమిస్తున్నాయి. ఈరెండు అలుగులు లీకేజ్ కావడంతో ఏజెన్సీలో కురిసే భారీ వర్షాలకు నీటి మట్టం పెరగడంతో బుంగలు మరింత పెరిగి అలుగుకు గండి పడే పరిస్థితి ఏర్పడుతుందని ప్రతి ఏటా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలుగు కింది భాగంలో మొత్తం గుట్టల మయం కావడంతో నీరు గుంటలను చీల్చుకుంటూ నీరు ప్రవహించడం వల్ల చెరువులో ఉన్న నీటి ప్రవాహం నెమ్మదిగా పోవడంతో అలుగుపై భారం పడుతుందని రైతులు తెలుపుతున్నారు. ప్రతి ఏటా బయ్యారం, గార్ల రైతాంగం ఈపెద్ద చెరువు నీరుపై ఆధారపడి తమ పంటలను సాగు చేస్తున్నారు. బయ్యారం మండల రైతాంగానికి జీవనాధారమైన పెద్ద చెరువు అలుగు ప్రమాదవశాత్తు తెగిపోతే బయ్యారం, గార్ల మండలంలోని వేలాది ఏకరాలు బీడు భూములుగా మారే అవకాశం లేకపోలేదు. బయ్యారం పెద్ద చెరువు అలుగులపై సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు నిమ్మకు నీరేత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఏటా అలుగు విషయం, అభివృద్ధి పనులు చేపట్టాలని, కాలువల మరమ్మత్తులు చేపట్టాలని విన్నవించుకున్నప్పటికి ఏ మాత్రం పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. మిషన్ కాకతీయ పనులపై ఖర్చుపెట్టిన కోట్ల రూపాయలను బయ్యారం పెద్ద చెరువు అభివృద్ధి, కాలువల మరమ్మత్తులకు ఉపయోగిస్తే రైతులకు ఎంతో మేలు కలిగేదని రైతులు పేర్కొన్నారు. అలుగు నుంచి ప్రవహించే నీరు వెళ్లకుండా అధికారులు చర్య లు తీసుకోవాలని, కాకతీయులు నిర్మించిన బయ్యారం పెద్ద చెరువు అలుగులను మరమ్మత్తులు చేయాలని, పంట కాలువలను యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న తూములు

జిల్లాకే తలమానికకంగావున్న బయ్యారం పెద్ద చెరువు బయ్యారం, గార్ల రెండు మండలాలకు సాగు, తాగునీరు అందిస్తూ ఈప్రాంత ప్రజానీకానికి ధాన్యాగారంగా విరాజిల్లుతున్నది. చెరువు కాలువలు అస్థవ్యస్థంగా వుండి, డ్రాఫ్‌లు కూలీపోయి, కాలువలలో చెత్త పేరుకొని ఇబ్బందికరంగా మారింది. ప్రతి సంవత్సరం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై కాలువలలో నీరు ప్రవహించేటప్పుడు కాలువల తాత్కాలిక మరమ్మత్తులకు లక్షల రూపాయల నిధులు మంజూరు చేయడం, ఆకాంట్రాక్ట్‌ను అధికార పార్టీ నాయకులు కైవసం చేసుకొని, నీరు ప్రవహించే కాలువల్లోనే నామమాత్రంగా కనీసం కాలువలోని గడ్డికూడా తొలగించకుండా పనులు చేపట్టి, లక్షల రూపాయలను దండుకుంటున్నారు. వేసవి కాలంలోనే కాలువల మరమ్మత్తులు చేపట్టాలని ఎన్ని సార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్నా ఏమాత్రం కూడా పట్టిం చుకోకుండా నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత సంవత్స రంతో పాటు ప్రతి ఏటా ఖరీఫ్ సీజన్‌లో పంట చేతికందే సమయంలో చివరి ఆయకట్టు రైతులకు నీరు అందక పంటలు ఏండిపోయి తీవ్ర నష్టాన్ని మిగిలిస్తుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతి నిధులు స్పందించి తక్షణమే కాల్వల మరమ్మత్తులు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అంతేకాకుండా పెద్ద చెరువు తుములు కూడా శిథిలావస్థకు చేరుకొని, తూముల షటర్లు కూడా పూర్తిగా తుప్పు పట్టి చిల్లులు పడ్డాయి. పెద్ద చెరువులో నీరు తుమూలకు చేరుకోగానే తూముల చిల్లుల ద్వారా లీకులు ఏర్పడ్డ చోట నుంచి భారీగా నీరు బయటకు నిత్యం ప్రవహిస్తూ, రైతులకు నీటి ఎద్దడి ఏర్పడటానికి ప్రధాన కారణం అవుతుంది. తుములు శిథిలావస్థకు చేరుకొని తూములు షటర్లకు చిల్లులు పడి నీరు వృథా అవుతున్నా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పంధించి పెద్ద చెరువులు అలుగులు, తూముల ను అభివృద్ధి చేపట్టాలని మండల రైతాంగం వేడుకుంటున్నారు.

ఆయకట్టు, తూములు అభివృద్ధికి నోచుకోవడం లేదు



బయ్యారం పెద్ద చెరువు అలుగు, తూములు నేటికి ఎలాంటి అభివృద్ధికి నోచు కోవడం లేదు. కాకతీ యులు నిర్మించిన బయ్యా రం పెద్ద చెరువు నేటి వరకు రైతాంగానికి ఎంతో అండగా ఉంటూ ఖరీఫ్, రబీ పంటల సాగుకు ఎంతో ఉపయోగపడుతుంది. కాని పెద్ద చెరువు మాత్రం నేటి వరకు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలకు నోచుకోలేదు. అలుగు ఆయకట్టు, తూములు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోని చాలా నీరు వృథా అవుతున్నా అధికారులు, పాలకులు ఏమాత్రం కూడా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్ద చెరువు అలుగు ఆయకట్టు, తూములను అభివృద్ధి చేపట్టాలి.

– నంబూరి మధు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు

కార్మిక సంఘం రాష్ట్ర నాయకులుగా వెంకన్న ఎన్నిక

నవతెలంగాణ-తొర్రూర్‌రూరల్



తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర మూడవ మహాసభలో తొర్రూర్ మండలం కర్కాల గ్రామానికి చెందిన సిగ్గం వెంకన్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికయ్యారు. మార్చి 25న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన మహాసభలలో 21 మంది కార్యవర్గంలో సెగ్గం వెంకన్న సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా వెంకన్న మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైనాయని ఆరోపించారు. సమస్యలపై దశల వారి పోరాటాలకు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా ఏప్రిల్ 16న పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నామని ఆయన తెలిపారు. తమ ఎన్నికకు సహకరించిన అందరికీ ఈ సందర్భంగా వెంకన్న కృతజ్ఞతలు తెలిపారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన

నవతెలంగాణ-మరిపెడ



వక్ఫ్ సవరణ బిల్లు'ను వ్యతిరేకిస్తూ మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపల్ కేంద్రంలో హౌసింగ్ బోర్డ్ సీతారాంపురం లో ఉన్న మస్జిద్-ఏ -రహమానియా లో ముస్లింలు శాంతియుత నిరసన చేపట్టారు. మస్జిద్-ఏ -రహమానియా మస్జిద్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు.ఈ కార్యక్రమంలో ఆల్ పార్టీ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మస్జిద్ కమిటీ సదర్ సయ్యద్ సర్వర్, యాకుబ్ పాషా, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు సయ్యద్ లతీఫ్ లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లింలకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో ఒక్కో బిల్లును ప్రవేశపెడుతోందని విమర్శించారు.దేశ వ్యాప్తంగా లక్షల ఎకరాల్లో ఉన్న వక్ఫ్ బోర్డు భూములను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి వర్ఫ్ బోర్డు బిల్లుకు సవరణలు చేపట్టిందని దుయ్యబట్టారు. తక్షణమే బిల్లును ఉపసంహరించుకోకపోతే దేశంలో లౌకికవాదం పూర్తిగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే వర్ఫ్ బోర్డు బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈనిరసన కార్యక్రమంలో అప్సర్,అహ్మద్, బాసిత్ ఖాన్, జాకీర్ హుస్సేన్, అవేజ్, ఘనీ, అజ్జు, అమీర్ బాబా, నజీమ్, హసేన్, అంజత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన కొండలమ్మ జాతర ఉత్సవాలు

నవతెలంగాణ-గార్ల:



మండలంలోని పినిరెడిగూడెం గ్రామంలో ఉన్న కొండలమ్మ దేవాలయంలో ఉగాది పండుగను పురస్కరిం చుకుని మూడు రోజుల పాటు నిర్వహిం చనున్న కొండలమ్మ జాతర ఉత్సవాలు ఘనంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. దశాబ్దాల కాలంగా వస్తున్న ఆచార, సాంప్రదా యాలను కొనసాగిస్తూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మొదటి రోజు ఏడ్ల బండ్ల ప్రభలతో డప్పు చప్పుళ్ళు, మేళా తాళాలతో నృత్యాలు చేస్తూ అంగరంగ వైభవంగా జాతర ఉత్సవాలను ప్రారంభించారు. గ్రామంలోని పురవీధుల నుండి కొండలమ్మ దేవాలయం వరకు ఎడ్ల ప్రభ లతో మేళా తాళాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బి.మల్లేశం, మాజీ చైర్మన్‌లు కె.నారాయణరెడ్డి, పి.సత్యనారాయణ, గ్రామ పెద్దలు, భక్తులు, ప్రజలు, అధికసంఖ్యలో పాల్గొన్నారు.



ప్రజా ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

- వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిరుపతిరెడ్డి

నవతెలంగాణ-తొర్రూర్‌రూరల్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి జరుగుతాయని తొర్రూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డిల ఆదేశాల మేరకు శుక్రవారం మండలంలోని గోపాలగిరి గ్రామంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి, ఝాన్సీరెడ్డిలు కృషి చేస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అనుమాండ్ల నరేందర్ రెడ్డి, చర్లపాలెం, గోపాలగిరి గ్రామ పార్టీ అధ్యక్షులు నాగిరెడ్డి, చింతకుంట్ల లక్ష్మణ్, యనమల శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి
- బ్యుటిషియన్ ట్రైనింగ్ కోర్స్ సర్టిఫికెట్ల ప్రధానం

నవతెలంగాణ-తొర్రూర్



మహిళలు స్వతంత్రంగా, ఆర్థికంగా ఎదగాలంటే ఏదో ఒక రంగాన్ని ఎంచుకొని అందులో ప్రావీణ్యత సంపాదించాలని శ్రీవాణి ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకురాలు, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి అన్నారు. స్థానిక శ్రీవాణి ఎడ్యుకేషనల్ అండ్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సహకారం 45 రోజుల పాటు సాగిన బ్యుటీషియన్ ట్రైనింగ్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సుంకరనేని పినాకపాణి అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో 45 రోజులు బ్యూటీషియన్ కోర్స్ నేర్చుకున్న మహిళలందరికీ సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలందరూ ఆర్థికంగా ఎదగాలంటే తమకంటూ ఒక ప్రత్యేకమైనటువంటి విద్య బ్యూటిషన్, టైలరింగ్ కోర్సులు నేర్చుకొని ఆర్థికంగా ఎదిగి మహిళా సాధికారత దిశగా ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సిస్టర్ సహాయసహకారంతో ఇంత చక్కటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మహిళలందరికీ కూడా ఆర్థికంగా నిలబడే స్థాయిని పెంచే అవకాశం ఇచ్చినందుకు శ్రీవాణి ఎడ్యుకేషన్ అండ్ సోషల్ సర్వీస్ సొసైటీకి, ఈ కోర్సులో సర్టిఫికెట్స్ తీసుకున్న మహిళలందరికీ కూడా అభినందనలు తెలియజేశారు. ఈకార్యక్రమంలో ఎఫ్ఎంఎం కో-ఆర్డినేటర్ శ్రీకాంత్, ట్రైనింగ్ ఇచ్చిన ప్రీతి, కోర్స్ సర్టిఫికెట్ తీసుకున్న మహిళలు పాల్గొన్నారు.

ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

- తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-కేసముద్రంరూరల్:



కేసముద్రం మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించాలని కేసముద్రం మండల తహసీల్దార్ దామోదర్‌కి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షులు చాగంటి కిషన్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులందరిని ప్రభుత్వం తరఫున స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి సత్కరించాలని, తెలంగాణ ఉద్యమంలో అమరులైన ఉద్యమకారుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించి, రూ.10 లక్షల పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం ద్వారా గుర్తించిన ఉద్యమకారులకు మండల కేంద్రంలో 250 చదరపు గజాల నివాస స్థలము కేటాయించి, డబుల్ బెడ్ రూమ్ మంజూరు చేయాలన్నారు. రూ.నెలకు 25 వేల పెన్షన్ అందించాలన్నారు. . ఈకార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్, విద్యార్థి, యువజన జేఏసీ పూర్వ కన్వీనర్ దండు శ్రీనివాస్, చిట్యాల వీరన్న, మోడెం రవీందర్‌గౌడ్, దార్ల రామ్మూర్తి, శివారపు శ్రీధర్, వేల్పుల రేవంత్, బాలు మోహన్, వేం నరసింహారెడ్డి, జనిగల పరమేశ్వర్, వంగాల అశోక్, షేక్ ఇమాం, గాడిపెల్లి వెంకట్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ బయట కొనుగోళ్లు


నవతెలంగాణ-కేసముద్రంరూరల్:

కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ గంట సంజీవరెడ్డి చైర్మన్ ఆదేశాల మేరకు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మహబూబాబాద్ రూరల్ సర్వయ్య సమక్షంలో వ్యవసాయ మార్కెట్ బయట వ్యాపారస్తుల వ్యాపార ప్రాంగణంలో నేరుగా కొనుగోలు చేయు క్రమంలో రైతులకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నందున వాటి సమస్యలను అధిగమించు విషయమై వ్యాపారస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసమావేశంలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మాట్లాడుతూ ఎవరు కూడా తమ వ్యాపార ప్రదేశంలో నేరుగా కొనుగోలు జరుపకూడదని తెలియజేశారు. కేసముద్రం ఎస్సై వ్యాపారస్తులకు, వేబ్రిడ్జి వారికి నోటీసులు జారీ చేయమన్నారు. సీఐ మార్కెట్ యార్డ్‌ను సందర్శించి మిర్చి రైతులతో చర్చించారు. ఈసమావేశం మార్కెట్‌లో కమిటీ మెంబర్ చిదురాల వసంతరావు, కేసముద్రం ఎస్సై మురళీధర్‌రాజ్, వ్యాపారస్తులు, కార్మిక సంఘ నాయకులు, దడువాయి సంఘ నాయకులు, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వీపర్స్ స్కావెంజర్ల సమస్యలు పరిష్కరించాలి

- స్కావెంజర్ల సంఘం జిల్లా కన్వీనర్ ఈసంపల్లి సైదులు

నవతెలంగాణ-నెల్లికుదురు



ప్రభుత్వ పాఠశాల స్వీపర్స్ అండ్ స్కావెంజర్ల వర్కర్స్ సమస్యలను పరిష్కరించి పెండింగ్‌లో ఉన్న వేతనాలను తక్షణమే విడుదల చేయాలని స్కాంవెంజర్ల సంఘం జిల్లా కన్వీనర్ ఈసంపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మేము ప్రభుత్వ పాఠశాలలో గదులను, టాయిలెట్స్ పరిసరాలను శుభ్రపరుస్తున్నామని, కాని మాకు 6 నెలల నుండి జీతాలు రాక, బయట అప్పులు చేసి. కుటుంబాన్ని పోషించుకోవలసిన పరిస్థితి ఏర్పడింది అని ఆవేదన వ్యక్తం చేశాడు. మమ్ములను నియమించేటప్పుడు నెల, నెలా జీతాలు వేస్తామని చెప్పడం జరిగినది కాని పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుండి ఇంత వరకు జీతాలు రాలదన్నారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వార జీతాలు చెల్లిస్తామని చెప్పి నేటికి అమలు చేయ లేదన్నారు. నిత్యావసర సరుకుల ధరలను పెంచి కార్మికులపై మోయలేని భారాన్ని మోపినాయని వాపోయారు. డిమాండ్లను పరిష్కరించని ఎడల రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు వెళ్తామన్నారు. .ఈసమావేశంలో వెంకన్న ఐలమ్మ సీతమ్మ, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



రూ.కోటి విలువైన గంజాయి దగ్ధం

నవతెలంగాణ-మహబూబాబాద్

మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా సీజ్ చేయబడిన రూ.కోటి ఇరవై ఎనిమిది లక్షల ఇరవై తొమ్మిది వేల నాలుగు వందల(రూ.1,28,29,400) విలువైన 513 కేజీ 176 గ్రాముల గంజాయిని మహబూబాబాద్ జిల్లా పోలీసులు దగ్ధం చేశారు. కాకతీయ మెడిక్లీన్ ఏజెన్సీ, ఊర్సుగుట్ట, హన్మకొండలో మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్ మాదకద్రవ్యాల నిరోధక శాఖ ఆదేశాలమేరకు డ్రగ్ డిస్పోసల్ కమిటీ సభ్యుల సమక్షంలో గంజాయి దగ్ధం జరిగింది. ఈకార్యక్రమంలో డీఎస్పీ గంద్రాతి మోహన్, టౌన్ డీఎస్పీ తిరుపతి రావు, డీసీఆర్‌బీ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ, గూడూరు సీఐ సూర్య ప్రకాష్, మహబూబాబాద్ టౌన్ సీఐ దేవేందర్, మరిపెడ సీఐ రాజకుమార్, అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు గత కొంతకాలంగా చేపట్టిన విస్తృత తనిఖీల్లో పట్టుపడి 9 కేసులలో స్వాధీనం చేసుకున్న గంజాయిని జిల్లా మాదకద్రవ్యాల నిరోధక చట్టం నిబంధనల ప్రకారం ధ్వంసం చేశారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలను నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని, యువతను డ్రగ్స్ మాయలోకి దూరనీయకుండా అవగాహన కార్యక్రమాలు, కఠినమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఎవరైనా మాదకద్రవ్యాల సరఫరా, వినియోగం గురించి సమాచారం అందిస్తే ఆవ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

తొమ్మిది కిలోల గంజాయి పట్టివేత



నవతెలంగాణ-తొర్రూర్

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో మహారాష్ట్రకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి శుక్రవారం సుమారు 9 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జి.ఉపేందర్ తెలిపారు. ఒరిస్సా రాష్ట్రం నుంచి మహారాష్ట్రకు వయా తొర్రూర్ మార్గంగా తరలిస్తున్నట్లుగా గుర్తించామని ఎస్సై తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై జి.ఉపేందర్ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-గూడూరు

మండలంలోని కోబల్ తండాకు చెందిన బానోతు హుస్సేన్(36) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై గిరిధర్ రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్‌లో ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తుంటాడు. ఈ క్రమంలో భార్యాభర్తల గొడవ రావడం వల్ల జీవితంపై విరక్తి చెంది సోమవారం గూడూరుకు వచ్చి పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ గురువారం చెందినట్లు తెలిపారు. మృతుడు తండ్రి బానోతు నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
6
జయశంకర్
ములుగు - భూపాలపల్లి
శనివారం మార్చి 29, 2025
www.navatelangana.com

జీలపల్లి పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం

నవతెలంగాణ-మల్హర్‌రావు (మహముత్తారం)

మహముత్తారం మండలంలో జీలపల్లి గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం,పాఠశాల వార్షిక దినోత్సవం ఘనంగా శుక్రవారం నిర్వహించడం జరిగిందని పాఠశాల ప్రధానో పాధ్యా యురాలు జి.సు మలత తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు ఐదవ తరగతి విద్యార్థులు పాఠశాల నిర్వహణ, తరగతుల బోధనను చాక చక్యంగా నిర్వ హించా రన్నారు.విద్యార్థులు బోధన అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించినట్లుగా పేర్కొన్నారు. విద్యార్థులు జీవితంలో ప్రతి పనిని బాధ్యతగా తీసుకొని క్రమశిక్షణతో నిర్వహించాలని అప్పుడే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుంటారని చెప్పారు. ఐదవ తరగతి విద్యార్థులు పాఠశాల నిర్వహణ బాధ్యత చాలా చక్కగా నిర్వహించారని విద్యార్థులను అభి నందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు జ్యోత్స్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ తడండ్ల రజిత భాస్కర్,విద్యార్థులు పాల్గొన్నారు.



మతసామరస్యానికి ప్రతీక రంజాన్

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ముఖ్య ఉద్దేశం

భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే

నవతెలంగాణ-భూపాలపల్లి

మతసామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ముస్లిం పోలీసులు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్వ మతాల సారం ఒకటేనని, ఉపవాస దీక్షలు, ఆరాధన, ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ సోదరా భావం, మానవత్వం పెంపొందిస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎస్పీ కిరణ్‌ఖరే మాట్లాడుతూ..సద్గునాలను పెంపొందించడమే రంజాన్ మాస ముఖ్య ఉద్దేశమన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ బోనాల కిషన్, భూపాలపల్లి, కాటారం డీఎస్పీలు సంపత్ రావు, రామ్మోహన్ రెడ్డి, డిటిఓ సందాని, జిల్లా పరిధిలోని సిఐలు ఎస్సైలు, పట్టణ ముస్లిం పెద్దలు, పోలీసు ముస్లిం ఉద్యోగులు పాల్గొన్నారు.



గణపురం : రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం రాత్రి చెల్పూర్ గ్రామంలోని లక్ష్మం జయచంద్ర గార్డెన్‌లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో స్థానిక మండల కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.అనంతరం ఎమ్మెల్యేకు పలువురు ముస్లిం సోదరులు శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులు, స్థానిక కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

నవతెలంగాణ-ములుగు

సమాజంలో ఆపదలో ఉన్న వారికి దాతలు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. శుక్రవారం రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం.సంపత్ రావు (టీజీవో ములుగు జిల్లా అధ్యక్షులు) ఆధ్వర్యంలో నిర్వహించారు.తలసేమియా బాధితుల కోసం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మ హేందర్‌జీతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా రవిచందర్ మాట్లాడుతూ తలసేమియా బాధితుల కోసం మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన అధికారులకు అభినందనలు తెలిపారు. రక్తదాతలకు ధ్రువపత్రాలను అందజేశారు.అదనపు కలెక్టర్ సంపత్ రావు రక్తదానం చేసి ఉద్యోగులకు, దాతలకు స్ఫూర్తిగా నిలిచారు.ములుగు లయన్స్ క్లబ్, ములుగు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు రక్తదాన శిబిరంలో అరటి పండ్లు మినరల్ వాటర్ బ్లడ్ దాతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో 39బిఎన్ సిఆర్పిఎఫ్ సెకండ్ ఇన్ కమాండెంట్ ఎస్కేప్ పంచం లాల్, డిప్యూటీ కమాండెంట్ ఎస్.ఎంటి ఎస్. పి.రజిత,అసిస్టెంట్ కమాండెంట్ ఎస్కేప్ షహీద్ అలీ,ఎస్ఎంటి డాక్టర్ కె తర్కేశ్వరి, 39 బెటాలియన్ జవాన్స్, టీజీవో, టీఎన్జీవో, ఉపాధ్యాయ సంఘాలు, లయన్స్ క్లబ్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది, సిఆర్పిఎఫ్ ములుగు, స్టేట్ బెటాలియన్ చల్వాయి, పోలీస్ శాఖ, వివిధ సంఘాల ఫోరమ్స్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ మెర్గు రమేష్ కార్యదర్శి చుంచు రమేష్ కొండి సాంబశివ, డి. బలరాం రెడ్డి, ముక్కు సుబ్బారెడ్డి రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు కార్యదర్శి కోశాధికారి చుంచు రమేష్, సిరుప సతీష్, వివిధ కార్యాలయాల ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు ములుగు యువకులు పాల్గొన్నారు.



రోడ్లపై ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి

ప్రమాదాలు కారణమయ్యే ప్రాంతాలను గుర్తించాలి

జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్‌జీ

నవతెలంగాణ-ములుగు

జిల్లాలో రోడ్లపై ప్రమాదాలు జరగకుండా నివారించాలని, ప్రమాదాలు కారణమయ్యే ప్రాంతాలను గుర్తించి రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్ మహేందర్‌జీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహేందర్‌జీ తన ఛాంబర్లో జిల్లాలో ఉన్న జాతీయ రాష్ట్ర రహదారులపై ప్రమాదాలు తగ్గించడానికి అవలంబించాల్సిన విధానాలపై, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆర్టీఓ వెంకటేష్, డీఎస్పీ రవీందర్‌తో కలిసి జిల్లా రోడ్డు సేఫ్టీ మీటింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదా రులపై ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాలలో ప్రమాదాలు జరగకుండా నివారించడం కోసం పోలీసు, రోడ్లు భవనాలు, ఎక్సైజ్, ఆర్టీవో , ఆర్టీసీ తదితర శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.జాతీయ రహదారి 163పై ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఆ ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ వద్ద ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాలపై సమావేశంలో చర్చించారు. మొదట అధికంగా ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్స్ ప్రాంతాల వద్దకు పోలీసులు, ఆర్అండ్‌బి అధికారులు వెళ్లి తనిఖీ చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వేగాన్ని తగ్గించే నివారణ చర్యలు ఏమైనా ఉంటే వాటిని అభివృద్ధి చేయాలని, వేగాన్ని తగ్గించడానికి బారికేట్స్‌తో పాటు, డంబుల్ స్ట్రిప్స్ పెట్టాలని, సైన్ బోర్డ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. డీఎస్పీ రవీందర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరగకుండా పోలీస్ శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పని చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలి

సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకుప్రవీణ్ కుమార్

తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా

నవతెలంగాణ-భూపాలపల్లి

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయిందని, ఇప్పటికైనా రేషన్ కార్డులను వెంటనే మంజూరు చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు సిపిఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని వెంటనే రేషన్ కార్డులను మంజూరు చేసి రాజీవ్ యువ వికాసం పథకాన్ని యాదవిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 280లో పేదలు గుడిసెలు వేసుకుని భూపోరాటం చేస్తూ మూడు సంవత్సరాలు అవుతున్నప్పటికీ కూడా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. భగత్ సింగ్ కాలనీ వాసులకు ఇంటి నెంబర్లను మంజూరు చేయాలని, మిషన్ భగీరథ ద్వారా గుడిసె వాసులకు మంచినీటి వసతులు కల్పించాలని, రోడ్లు డ్రైనేజీ మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నేరెళ్ల జోసెఫ్, గద్దం సింహాద్రి, ఎండి యాకుబ్ పాషా, పీక రవి, గోనెల తిరుపతి, దొంతరబోయిన అజయ్,బౌతు కమలాకర్ కొమ్మెర రమేష్ చారి, మేడి శేఖర్, గోలి లావణ్య, గద్దం స్వరూప, పెద్దమామల సంధ్య, చిట్యాల తిరుపతమ్మ, మట్టి నాగమణి, ఇటుకల శ్రీలత, వాసం రజిత, పాండవుల రాజేశ్వరి, పోతుగంటి స్వప్న కట్టగోల భారతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.



రామనవమికి విరాళాలు

నవతెలంగాణ-గణపురం

మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన పట్టాభి సీతారామచంద్రస్వామి దేవాలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు శుక్రవారం భారీగా విరాళాలు అందించారు. గణపురం మండల కేంద్రానికి చెందిన దండుగుల అశోక్ ఫోటో గ్రాఫర్ 50 కేజీల బియ్యాన్ని కర్షక్ పెట్రోజెన్స్ నిర్వా హకులు దేసు ప్రదీప్ 100కేజీల బియ్యాన్ని హరిహర దస్తావేజ లేఖరి నిర్వాహకులు తాళ్లపల్లి పావని నిరంజన్‌గౌడ్ దాము కిరాణం నిర్వాహకులు 10లీటర్ల వంటనూనెను, ఆలయ అభివృద్ధిలో భాగంగా గాజర్ల రఘుపతి కీర్తిశేషులు వారి జ్ఞాపకార్థం వారి కుమారుడు గాజర్ల రాజు (చింటూ) 5.116 రూపాయలు ఆలయ కమిటీ అధ్యక్షులు తాళ్లపల్లి గోవర్ధన్‌గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలి రూ.600 చెల్లించాలి

ఆర్టీఐ జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లుగౌడ్

కాటారం డివిజన్ కన్వీనర్ చింతల కుమార్ యాదవ్

నవతెలంగాణ-మల్హర్‌రావు

ఉపాధిహామీ పథకం కూలీలు శ్రమ దోపిడీకి గురవు తున్నారని,రోజు కూలి రూ.600 చెల్లించాలని యునైటెడ్ ఫోరమ్ ఫర్ ఆర్టీఐ భూపాలపల్లి జిల్లా కన్వీనర్ చర్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, కాటారం డివిజన్ కన్వీనర్ చింతల కుమార్ యాదవ్‌లు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు గ్రామాల్లో జాబ్ కార్డున్న ప్రతి ఒక్కరికి పని కల్పించాలన్నారు. కొలతలు పెట్టి పనులు చేయించడంతో కూలీలకు రోజువారీ కూలి రూ.100 మాత్రమే రావడంతో శ్రమ దోపిడీకి గురవుతు న్నట్లు తెలిపారు. కొలతల నిబంధన తొలగించి రోజువారీ కూలి రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు.

జీపీ నియమ నిబంధనలు పాటించాలి

ముగిసిన చెల్పూర్ అంగడి వేలంపాట

డిఎల్‌పిఓ వీరభద్రం

నవతెలంగాణ-గణపురం

గ్రామపంచాయతీ నియమ ని బంధనలు పాటించాలని డిఎల్పిఓ వీరభద్రం అన్నారు. శుక్రవారం మండలంలోని చెల్పూర్ గ్రామ పంచాయతీ యొక్క తైబజార్ వేలం పాట శుక్రవారం డిఎల్పిఓ వీరభద్రం ఆధ్వర్యంలో ముగిసింది. మొత్తం ముగ్గురు డిపాజిటర్లు పాల్గొనగా బత్తిని శివశంకర్ రూ.2,20,200 వేలం వేసి పాటను దక్కించుకున్నారు. ఈ వేలం ఒక సంవత్సరం మాత్రమే గడువుంటుందని గ్రామ పంచా యతీ నియమ నిబంధనలు పాటించాలని డిఎల్పిఓ వీరభద్రం వేలం దక్కించుకున్న వారికి సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ సూరం బాలకృష్ణ, పంచాయితీ కార్యదర్శి ముక్కెర హేమంత్ పాల్గొన్నారు.

బాధితుడికి శీనుబాబు పరామర్శ

నవతెలంగాణ-మహదేవపూర్

కాటారం మండలం ఓడిపిలవంచ గ్రామానికి చెందిన దండ్రు మధుకర్ దండ్రు రమేష్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురై గారేపల్లి సురేష్ హాస్పిటల్లో చికిత్స పొందుతుండగా వారిని శుక్రవారం శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శీను బాబు పరామర్శించి వైద్యులను ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొని మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంటకాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

నవతెలంగాణ-చిట్యాల

చిట్యాల మండలం నవాబ్‌పేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బంజర రవీందర్ కుమారుడు, బంజర ఉదయ్ కిరణ్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందగా వారి కుటుంబాన్ని చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గూట్ల తిరుపతి శు క్రవారం పరామర్శించి వారి చిత్ర పటానికి నివాళులు అర్పించారు. వారి వెంట మండల యూత్ అధ్యక్షులు అల్లకొండ కుమార్, సీనియర్ నాయకులు రాజి రెడ్డి,చిట్యాల టౌన్ అధ్యక్షుడు బుర్ర లక్ష్మణ్ గౌడ్ , స్థానిక నాయకులు సర్వ శరత్,యూత్ నాయకులు కిరణ్, నాగరాజు, వినయ్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న మొబైల్ అప్పగింత

నవతెలంగాణ-చిట్యాల

సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితునికి తిరిగి సెల్‌ఫోన్ అప్పగించిన ఎస్ఐ శ్రావణ్ కుమార్ శుక్రవారం మండలంలోని తిరుమలాపూర్ గ్రామానికి చెందిన గద్దల ప్రవీణ్ తన ఊరిలో జరిగిన పెళ్ళిలో తన వన్ ప్లస్ ఎక్కడో పడిపోయింది అని రెండు నెలల క్రితం చిట్యాల పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వగా, చిట్యాల పోలీసులు సిఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్ గుర్తించి బాధితునికి అందజేశారు. మొబైల్ ఫోన్ గుర్తించడంలో సహాయపడిన కానిస్టేబుల్ లాల్‌సింగ్‌ను ఎస్ఐ శ్రావణ్ కుమార్ అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
హనుమకొండ
శనివారం | మార్చి 29, 2025 | www.navatelangana.com

విఎంఆర్‌లో ప్రదీప్ కుమార్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ,రాంపూర్ ఘనంగా కళాశాల దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ



విఎం.ఆర్ ప్రదీప్ కుమార్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం ఒక సుసంపన్నమైన సాంస్కృతిక కార్యక్రమాల తో పాటు విద్యార్థుల విజయాలను గౌరవించే కళాశాల దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్, హైదరాబాద్ సెక్రటరీ ఎ.పుల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరుకాగా, గౌరవ అతిథిగా డా. ఎన్.రమణ, మాజీ ఎంపీ రాజ్యసభ క్యాప్టన్ వి.లక్ష్మీకాంతరావు , సెక్రెటరీ జి. కరుణా, ప్రిన్సిపల్ డాక్టర్ పి.యెల్లయ్య, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.యెల్లయ్య స్వాగతోత్సవంతో కార్యక్రమం ప్రారంభం కాగా ముఖ్య అతిథి ఎ.పుల్లయ్య ప్రేరణాత్మకమైన మాటలతో విద్యార్థులను ప్రోత్సహించారు. గౌరవ అతిథి డా. ఎన్.రమణ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కెప్టెన్ వి.లక్ష్మీకాంత రావు విద్యార్థుల శ్రేష్ఠత, కో-కరిక్యులర్ కార్యకలాపాల గురించి వివరించారు. ఈ వేడుకలో విద్యార్థుల నత్యాలు, వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి.

నిర్మాణ పనులు అడ్డుకుంటున్న జీపీ అధికారులు

నవతెలంగాణ-ఐనవోలు



మండలం పంథిని గ్రామంలో నూతన ఫంక్షన్ హాల్ నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్నప్పటికీ గ్రామ కార్యదర్శి కావాలని ఆటంకాలు సష్టిస్తూ అభివద్ధి అడ్డుకుంటున్నారని ఫంక్షన్ హాల్ బాధితుడు మెరుగు రమేష్ ఆరోపించారు. బాధితులు మెరుగు రమేష్ తెలిపిన వివరాల ప్రకారం 323. సర్వేనెంబర్. భూమిని నాలా కన్వెన్షన్ చేసుకుని కూడా పర్మిషన్ తీసుకున్నట్లు చెప్పారు.పంచాయతీ కార్యదర్శి ఫంక్షన్ హాల్ కు కూడా, అనుమతి లేదంటూ నోటీసులు జారీ చేసి కావాలని ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. ఇరిగేషన్ అధికారులు, కూడా అధికారులు రెవెన్యూ మండల తాసిల్దార్, అగ్నిమాపక అధికారుల పర్మిషన్ అనుమతులు తీసుకున్నట్లు చెప్పారు. నిర్మాణంపై పై బ్యాంకులో లోన్ తీసుకున్నట్లు. చెప్పారు పూర్తి డాక్యుమెంట్ లేనట్టయితే లోన్ మంజూరు ఎలా అవుతుంది. కావాలని గ్రామ అధికారి నాపై ఒత్తిడి చేస్తుంది. ఫంక్షన్ హాల్ ప్రాజెక్టుపై 1.పర్సెంట్ కమిషన్ గ్రామ కార్యదర్శి అడుగుతున్నట్లు ఆరోపించారు. కమిషన్ ఇవ్వని కారణంగా నోటీసులు జారీచేసి గ్రామ సిబ్బందితో నిర్మాణ పనులకు ఆటంకాలు కలిగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నట్టు బాధితుడు మెరుగు రమేష్ ఆరోపించారు. లెవెల్ వన్, లెవల్ టు మాన్యువల్ గా పర్మిషన్ డాక్యుమెంట్ గ్రామ కార్యదర్శి సబ్మిట్ చేసినప్పటికీ టెక్నికల్ పర్మిషన్ రావాలి అని కుంటి సాకులు చెబుతూ పనులకు ఆటంకం కలిగిస్తున్నారని అధికారులు ఆఫీసులో టెక్నికల్ ప్రాబ్లం వల్ల ఆన్లైన్ అనుమతి పత్రాలు ఇవ్వలేకపోయామని మ్యానువల్ గా లేఅవుట్ కాకతీయ అర్బన్ డెవలప్మెంట్ అనుమతి పత్రాలు జారీ చసిన జిరాక్స్ ప్రజల పత్రిక విలేకరుల సమావేశంలో మెరుగు రమేష్ ఆరోపించారు.

పంతిని గ్రామ కార్యదర్శి వివరణ ...

పంతిని గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులపై కూడా అధికారులు, ఎంపీడీవో కార్యాలయం నుండి నిర్మాణ పనులు నిలిపివేయాలని పై అధికారులు ఆదేశాలు జారీ చేశారని అందులో భాగంగానే. అధికారుల ఆదేశానుసారం ఫంక్షన్ హాల్ యజమానికి నోటీసులు జారీ చేయడం జరిగిందన్నారు. తనకు ఎవరిపై కోపం ద్వేషం లేదని గ్రామ కార్యదర్శి వివరణ ఇచ్చారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-ధర్మసాగర్

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర బీజేపీ మాజీ కార్యవర్గసభ్యులు పెరుమాండ్ల వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ శుక్రవారం మండలంలోని మల్లక్కపల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ సమస్యలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామములో జరుగుతున్న మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద జరుగుతున్న పనిని సందర్శించి, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గత సంవత్సరం చేసిన పనికి డబ్బులు రాలేదు అని, ప్రస్తుతం ఇప్పుడు పనిచేసి 2 నెలలు గడిచినా డబ్బులు రాలేదు వారు వివరించారు.పని దగ్గర నీళ్ళు లేవు, మెడికల్ కిట్ లేదు,నడవడం ఇబ్బంది అవుతుందని, నీడ రావడానికి టెంటు లేదని,ఇతరత్రా సమస్యలు చెప్పడంతో సంబంధిత అధికారులకు వారు ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలను సమకూర్చి వారు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఉపాధి హామీ పథకం సెంట్రల్ ఫన్ నుండి చెల్లించాల్సిన బకాయిలను కేంద్రం చెల్లిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం దాన్ని దొరికినయోగం చేస్తూ ఇతర వాటికి వాడుకోవడం జరుగుతుందని విమర్శించారు. ఇలాంటి చర్యలకు పాల్పడకుండా కూలీలకు చేసిన పనికి వేతనం వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో బిజెపి బూత్ అధ్యక్షుడు బైరాపాక శ్రీను, బిజెపి నాయకులు బజ్జూరిలోకేష్,తాటికాయల చిరంజీవి,బైరపాక చిన్న తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీకగా ఫకీర్‌షావలీ జాతర





నవతెలంగాణ-ఎల్కతుర్తి

ఉగాది పర్వదినాన హిందువులందరూ షడ్రుచులతో ఉగాది పచ్చడి సేవిస్తూ పండుగ జరుపుకుంటుంటే ఎల్కతుర్తి మండలంలోని దామెరలో ముస్లింలతో కలిసి ఫకీర్ షావలీ జాతర ఘనంగా నిర్వహిస్తారు. కోరిన మొక్కులను ఫకీర్ షావలి తీరుస్తాడని ఇక్కడి గ్రామస్తుల నమ్మకం. భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, ధర్మసాగర్, హసన్‌పర్తి, కాజీపేట, హనుమకొండ మండలాల్లోని గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి దామెర గుట్టపై ఉన్న పకీర్ షావలిని దర్శించుకుని ముడుపులు చెల్లిస్తారు. అసలు కథ ఏంటంటే కొన్నేళ్ల కింద ఆత్మకూరు మండల కేంద్రంలో మిలిటరీ క్యాంపులో పనిచేస్తున్న డాక్టర్ హజరత్ ఫకీర్ షావలి పర్యటన నిమిత్తం గుర్రంపై దామెర గ్రామానికి వచ్చేసరికి కలరా వ్యాధితో వందలాది మంది ప్రజలు చనిపోయారు. ఆయన వారి కష్టాలు చూసి బాధలకు చలించి, ఇక్కడే ఉండి ప్రజలకు సేవ చేస్తూ, వారి రోగాలు నయం చేస్తూ వారితో పాటే ఉన్నాడు. ఆయన గ్రామస్తులతో నేను ఉగాది పర్వదినాన చనిపోతానని, తనను దామెరగుట్ట పైన ఖననం చేయాలని సూచించి ఆయన చెప్పిన విధంగానే ఉగాది పర్వదినం రోజున చనిపోయాడు. మిత్రులందరికీ ఆయన మాటలను నమ్మక కిందనే ఖననం చేయడానికి తీసుకు వెళుతుంటే, ఆయన మాయమై, గుట్టపై పార్థివదేవం కనబడిందని అంటారు. అప్పుడు ఆయన చెప్పింది నిజమని గుట్ట పైన ఆయనను ఖననం చేశారు. అప్పటినుండి ప్రతి ఉగాది పండుగ రోజున, సంతానం లేని వారు, ఆరోగ్యం సరిగా లేనివారు ఆయనను మనసులో మొక్కి ఉగాది పర్వదినాన జెండా కట్టి, గోధుమ రొట్టెలతో చేసిన మలిదముద్దలు నైవేధ్యం పెడతా, అని మొక్కుకుంటే వారు కోరిన కోరికలు తీరుతాయని ఇక్కడి ప్రజల నమ్మకం. ఇక్కడినుండి బ్రతుకుతెరువు కోసం సూరత్, బొంబాయి, హైదరాబాద్, భీమండి వెళ్లిన హిందువులు తప్పకుండా ఉగాది రోజున వచ్చి వారు మొక్కిన మొక్కులు చెల్లించుకుంటారు. సుమారు 20వేల మంది పైచిలుకు ప్రజలు ప్రతి ఏటా దర్శించుకుంటారు. అంతట ఉగాది పండుగ జరుపుకుంటుంటే కేవలం దామెరలో మాత్రం హిందువులు, ముస్లింలు మతసామరస్యానికి ప్రతీకగా పకిరి షావలి జాతరను ఘనంగా జరుపుకుంటారు.

ఎండి రహీముద్దీన్ ముజాహర్.. దామర గ్రామం

కొన్ని ఏళ్లుగా కష్టతరమైన గుట్టపై ఎక్కడానికి మెట్లు చేయించాలని పాలకులకు ప్రజలకు విన్నవించాను. అయినప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదు. ఈసారైనా మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ విన్నవిస్తానని తెలిపారు. 50 ఏళ్లుగా మా పెద్దలు పూజలు చేస్తున్నారు వారి తర్వాత మేము కూడా సేవలో ఉంటున్నామని పేర్కొన్నారు.

దివ్యాంగులకు యూడీఐడీపై అవగాహన సదస్సులు

నవతెలంగాణ-వరంగల్



జిల్లా గ్రామిణాబి వద్ధి సంస్థ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో దివ్యాంగులకు యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ (యూడీఐడీ) కార్డులు %-% అవగాహన సదస్సు శుక్రవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి టి ఆర్ డి ఓ పి డి కౌసల్యాదేవి, జెడ్పిసిఓ రాంరెడ్డి డిపిఓ కల్పన గార్లు పాల్గొని యు డి ఐ డి మీద పవర్ ప్రెసెంటేషన్ ద్వారా దివ్యాంగులకు అవగాహన కల్పించారు.ఈ సదస్సులో దివ్యాంగుల గుర్తింపు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ (యూడీఐడీ) కార్డులను జారీ చేస్తోందని. ఈ కార్డులు ఉన్న వారికి మాత్రమే కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. ఈ సదస్సులో డి ఆర్ డి ఓ పి డి కౌశల్య దేవి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఇప్పటికే సదరం సర్టిఫికెట్ తీసుకున్న వారికి యూడీఐడీ కార్డులను ఆటోమేటిక్ గా జనరేట్ చేసి వారి ఇంటికి పంపిస్తారని వారు పేర్కొన్నారు.కొత్తగా సర్టిఫికెట్ కావాల్సిన వారు, సదరం సర్టిఫికెట్ గడువు ముగిసి రెన్యూవల్ చేసుకోవాల్సిన వారు మాత్రం కార్డు కోసం అప్లై చేసుకోవాలని వారు అన్నారు. ఈ యూడీఐడీ కార్డ్ వల్ల దివ్యాంగులకు మరింత ప్రయోజనం కలుగుతుందని ,ఆన్లైన్లో అప్లికేషన్ యూడీఐడీ కార్డు కోసం దివ్యాంగులు **www.swavlambancard.gov.in** వెబ్సైట్లో నేరుగా గానీ, మీ సేవ ద్వారా గానీ అప్లై చేసుకోవాలని సూచించారు.గతంలో మాదిరిగానే జిల్లా హాస్పిటల్లో నిర్వహించే మెడికల్ క్యాంపు నకు వారికి నిర్ధారించిన తేదిలో తప్పకుండ హాజరు కావాలని, అక్కడ వారికి స్లాట్ కేటాయించి మెడికల్ క్యాంప్ ఎప్పుడు ఉంటుందనేది ఫోన్ ద్వారా తెలియజేస్తారని పేర్కొన్నారు. వారు చెప్పిన రోజున క్యాంపు నకు హాజరైతే సంబంధిత డాక్టర్లు వారికి వైద్యపరీక్షలు నిర్వహించి వైకల్యం శాతాన్ని నిర్ధారిస్తారన్నారు.క్యాంపు నకు హాజరు అయ్యేవారు వారికి సంబందిచిన మెడికల్ రిపోర్ట్ లు తీసుకొని రావలెనని సూచించారు.ఆ వివరాలను ఆన్లైన్లో నమోదు చేస్తారని, దాని ప్రకారం యూడీఐడీ కార్డును పోస్టులో ఇంటికే పంపుతారన్నారు. ఈ విధానం వల్ల సదరం సర్టిఫికెట్ల మాదిరిగా రోజుల తరబడి హాస్పిటల్స్ చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని ,

వెబ్సైట్లో వివరాలు నమోదు చేయగానే ఒక ఎన్రోల్మెంట్ నంబర్ కేటాయిస్తారని అప్లికేషన్ స్టేటస్ ను ఈ ఎన్ రోల్ మెంట్ నంబర్ మరియు పుట్టిన తేదీ ద్వారా తెలుసు కోవచ్చు అన్నారు.

ఇంకా కార్డు రాని వారు తమ కార్డు జనరేట్ అయ్యిందా ? లేదా అనేది యూడీఐడీ పోర్టల్లో ఆధార్ నంబర్, మొబైల్ నంబర్ ద్వారా తెలుసు కోవచ్చు అన్నారు. ఒకవేళ కార్డు పోయినట్టయితే యూడీఐడీ పోర్టల్లో పీడబ్ల్యూడీ లాగిన్లోకి వెళ్లి 'కార్డ్ లాస్ట్' ఆప్షన్ ఎంచుకోవాలని, తర్వాత అందులో వివరాలు నమోదు చేస్తే కొత్త కార్డు ఇంటికి వస్తుం దని గతంలో సదరంలో తిరస్కరించిన వారు కూడా యూడీఐడీలో కొత్తగా అప్లై చేసుకోవచ్చు న్నారు.21 రకాల వైకల్యాలకు.వికలాంగుల హక్కుల చట్టం (ది రైట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబిలిటీ యాక్ట్) 2016 ప్రకారం కేంద్ర ప్రభుత్వం 21 రకాల వైక్యాలను గుర్తించిందని అన్నారు.

ఇప్పటివరకు సదరంలో బ్లైండ్నెస్లో విజన్,లెప్రసీ క్యూర్డ్, హియరింగ్ ఇంపేయిర్మెంట్, లోకోమోటర్ డిజేబిలిటీ, మెంటల్ రిటార్డేషన్, మెంటల్ ఇల్ నెస్కు మాత్రమే సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. యూడీఐడీలో ఈ ఏడింటితో పాటు మరో 14 రకాలను సైతం చేర్చారు.ఆటిజమ్ స్పెక్ట్రమ్, సెరబ్రల్ పాల్సీ, క్రానిక్ న్యూరోలాజికల్ కండీషన్స్, డ్వార్ఫిజమ్ (మరుగుజ్జు), హీమోఫీలియా, మల్టీపుల్ స్కైరోసిస్, మస్క్యులర్ డిస్ట్రోఫీ, పార్కిన్సన్, సికిల్సెల్, స్పెసిఫిక్ లెర్నింగ్ డిజేబిలిటీ, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ డిజేబిలిటీ, థలసేమియా, ఆసిడ్ అటాక్ విక్టిమ్స్, మల్టీపుల్ డిజేబిలిటీస్ను సైతం యూడీఐడీలో చేర్చారు.కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన యూడీఐడీ కార్డుల కోసం దివ్యాంగులు మీ%-%సేవలో అప్లై చేసుకోవాలి లేదా తమ దగ్గర ఉన్న ఫోన్ లేదా కంప్యూటర్ లలో నైన **www.swavlambancard.gov.in** లాగిన్ లో కెళ్ళి తమ పేర్పు నమోదు చేసుకోవాలని అన్నారు.ఇప్పటికే సదరం సర్టిఫికెట్ పొందిన వారికి యూడీఐడీ కార్డు డైరెక్ట్ గా వారు నమోదు చేసుకున్న ఇంటి అడ్రస్ కు పోస్ట్ ద్వారా వస్తుందన్నారు. కొత్తగా సర్టిఫికెట్ కావాల్సిన వారు, గతంలో సదరంలో రిజెక్ట్ అయిన వారితో పాటు సదరం సర్టిఫికెట్ గడువు ముగిసి రెన్యూవల్ కోసం ఎదురుచూస్తున్న వారు మాత్రమే యూడీఐడీ కోసం అప్లై చేసుకోవాలన్నారు.

ఈ కార్యక్రమానికి డి. ఎం హెచ్.వో సాంబశివరావు తదితరులు హాజరు కావడం జరిగింది.

నవతెలంగాణ

మహబూబాబాద్

శనివారం | మార్చి 29, 2025 | www.navatelangana.com

రంజాన్ ముస్లింలకు అత్యంత పవిత్రమైన నెల: మైనారిటీ సంక్షేమాధికారి శ్రీనివాస్

నవతెలంగాణ-మరిపెడ



పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ముస్లిం సోదరులు అత్యంత కఠోరమైన ఉపవాస దీక్షలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని, అల్లాహ్ దీవెనలు అందరిపై ఉండాలని మహబూబాబాద్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి శ్రీనివాస్ ఆకాంక్షించారు. శుక్రవారం ఆయన మరిపెడ మండలంలోని జామా మజీద్ లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు అందించే ఇఫ్తార్ దావత్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులకు తాహసిల్దార్ సైదులతో కలిసి ఖర్జూర, పండ్లతో ఉపవాసదీక్ష విరమింప చేశారు. ఈకార్యక్రమంలో జామా మస్జిద్ మౌలానా బది ఉజ్జమ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు షేక్ తాజోద్దీన్, కేసముద్రం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పేదబోయిన ఐలమల్లు, మైనారిటీ నాయకులు అజీజ్, షేక్. అఫ్జల్, మహమ్మద్ అప్సర్, కేకే బ్రదర్స్ ఖలీల్ పాషా, ఖాదర్‌పాషా, సర్వర్‌పాషా, యాకుబ్ పాషా, మాజీ ఎంపీటీసీ గంధసిరి అంబరీష, మాజీ సర్పంచ్ పానుగోతు రాంలాల్, మెంచు అశోక్, కాంగ్రెస్ పార్టీ మూడు మండలాల ఇన్‌ఛార్జ్ కాలం రవీందర్ రెడ్డి, యువ నాయకులు కుడితి నరసింహారెడ్డి, జాటోతు సురేష్, మజీద్ కమిటీ షేక్ యాకుబ్ జానీ, మక్సూద్, సదర్ రజబలి, సత్తార్ పాష, ఆర్ఐ శరత్ చంద్ర, మున్సిపాలిటీ అధికారుల సిబ్బంది వీరన్న, గుర్రాల రాములు, కాంగ్రెస్ నాయకులు, ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్



దొడ్డ సోమయ్యకు నివాళులు

నవతెలంగాణ- పర్వతగిరి

రాయపర్తి మండలంలోని కొత్తూరు గ్రామంలో పర్వతగిరి సీనియర్ రిపోర్టర్ దొడ్డ శ్రీనివాస్ తండ్రి సోమయ్య సంవత్సరీకం సందర్భంగా శుక్రవారం మాజీ జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహ్మద్ సర్వర్ సోమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు ఐనవోలు దేవస్థానం ధర్మకర్త దారం పూర్ణచందర్, పర్వతగిరి పాత్రికేయులు బొమ్మెర రాజ్‌కుమార్, నాగుల రాజు తదితరులు పాల్గొన్నారు.

పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్త్ రఫ్ చేయాలి



ఎస్‌కేఎం ఆధ్వర్యంలో ధర్నా

నవతెలంగాణ-కాశిబుగ్గ

పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే బర్త్ చేయాలని ఆరాష్ట్ర గవర్నర్‌ను సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నాయకులు డిమాండ్ చేశారు. ఎస్‌కేఎం జాతీయ కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం రైతు సంఘం నాయకులు వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ సెంటర్లో నల్ల జెండాలతో ధర్నా నిర్వహించార. ఈకార్యక్రమంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు రాచర్ల బాలరాజు, సోమిడి శ్రీనివాస్, ఎండి ఇస్మాయిల్, ఇంద్రసేన, సుధామల్ల భాస్కర్, ఐత నగేష్, హంసల్ రెడ్డి, మైదం పాణి, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

సుభద్రాదేవి కుటుంబ సభ్యులకు అరూరి పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి సుభద్రా దేవి శుక్రవారం మరణించగా మృతురాలి కుటుంబ సభ్యులు తక్కల్లపెల్లి నారాయణ రావు, భాస్కర్ రావు లను వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయనతో పాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, వరంగల్ అర్బన్ కో-అపరేటివ్ బ్యాంకు చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు, మాజీ ఎమ్మెల్యే తక్కళ్లపల్లి రాజేశ్వరరావు, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



మంత్రివర్గ విస్తరణలో ఎమ్మెల్యే మురళీనాయక్ అవకాశం కల్పించాలి

ఎల్‌హెచ్ పీఎస్ మండల నాయకుడు బాలాజీ నాయక్

నవతెలంగాణ-నెల్లికుదురు

జరగబోయే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్‌కి మంత్రి పదవీ ఇవ్వాలని ఎల్‌హెచ్‌పీఎస్ మండల నాయకుడు బాలాజీ నాయక్, బైండ్ల సంఘం రాష్ట్ర నాయకుడు జిలకర యాలాద్రిలు కోరారు. మండల కేంద్రంలోని ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశాన్ని



నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెడుతున్న సంక్షేమ కార్యక్రమాలను, పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, ఇందిరమ్మ రాజ్యం అంటేనే బడుగు, బలహీనుల కాంగ్రెస్ పార్టీ అని నమ్మి భవిష్యత్తులో రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి అనేక రకాలుగా కష్టపడుతున్నారన్నారు. కావున ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్‌కు మంత్రి పదవీ ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎల్‌హెచ్‌పీఎస్ మండల నాయకులు బొజ్జ నాయక్, ఎఎంసీ డైరెక్టర్ భాస్కం "నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్, రాజునాయక్, లింగా నాయక్, వెంకన్న, పీఏసీఎస్ డైరెక్టర్ మంగీలాల్ నాయక్, సురేష్‌నాయక్, కిషన్ నాయక్, మోహన్‌నాయక్, శ్రీనునాయక్, తోరియా రమేష్‌నాయక్, నరేష్‌లు పాల్గొన్నారు.



ఘనంగా ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-నెల్లికుదురు

మండల కేంద్రంలోని ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఉపవాసాలు చేస్తున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందును కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు ఆకుతోట సతీష్ అందించినట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్ది రాజేష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని మసీదులో ఇఫ్తార్ విందును ఇచ్చే కార్యక్రమాన్ని ముస్లిం పెద్దలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులు 30 రోజులపాటు ఉపవాసాలు ఉంటూ మసీదులో ప్రార్థనలు చేస్తున్న వారికి ఇఫ్తార్ విందును కాంగ్రెస్ జిల్లా నాయకులు ఆకుతోట సతీష్ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని ముస్లిం సోదరులు రహిమాన్, అస్గర్‌అలీ, ఆసిఫ్‌లు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా మండల నాయకులు బాలాజీ నాయక్, మది రాజేష్, మౌనేందర్, క్రాంతి రెడ్డి, రావుల సతీష్, లింగమూర్తి, శ్రీకాంత్, పులి మురళీతోపాటు కొంతమంది కాంగ్రెస్ నేతలు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ప్రపంచ సుందరి పోటీలను వ్యతిరేకిద్దాం

నవతెలంగాణ-తొర్రూర్

72వ ప్రపంచ సుందరి పోటీలు వ్యతిరేకించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ సభ్యులు పగిడి పాల తిరుపతమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ముందు నిరసన తెలియజేసి, పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో బండారి ఐలయ్య హెచ్.లింగన్న, భాస్కర్‌రెడ్డి, బండపల్లి వెంకటేశ్వర్లు, ఎస్‌కే.తాజ్‌పాషా ఆలకుంట్ల సాయిలు, జాటోతు భిక్షపతి ఎస్‌కే బాబు పాషా, పాపయ్యలు పాల్గొన్నారు.



దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో యాదవులు ఐక్య ఉద్యమాలు చేయాలి

నవతెలంగాణ-తొర్రూర్(దంతాలపల్లి)

తెలంగాణ రైతాంగా సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య స్ఫూర్తితో రాష్ట్రంలోని యాదవులందరూ ఐక్య ఉద్యమాలు చేయాలని దొడ్డి కొమరయ్య విగ్రహ ప్రతిష్టాపన దాత ఉపేంద్ర యాదవ్ అన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆన్‌లైన్‌లో కూడా యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షురాలు తండా ఉపేంద్ర యాదవ్ పాల్గొని దొడ్డి కొమరయ్య విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సభ్యుల కోరిక మేరకు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని తన సొంత ఖర్చులతో తయారు చేసి ఇస్తానని సభ్యుల సమక్షంలో తెలిపారు. ఈకార్యక్రమంలో దొడ్డి కొమరయ్య విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సభ్యులు ఉడుగుల ఐలేష్ యాదవ్, ఆవుల సురేష్ యాదవ్, బొల్లు వీరన్న యాదవ్, గుండాల ఐలయ్య యాదవ్, కొండ వెంకన్న యాదవ్, బెల్లి సంపత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు కుమారస్వామి పదవీ విరమణ

ఘన సన్మానం..



నవతెలంగాణ-గూడూరు

మండలంలోని ఎంపీ యూపీఎస్ బొల్లెపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులు కప్పల కుమారస్వామి శుక్రవారం పదవీ విరమణ పొందారు. పదవీ విరమణ కార్యక్రమంలో కుమారస్వామికి మండల విద్యాధికారి, రవి కుమార్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఫరూక్ శాలువాలతో సత్కరించారు. ఇట్టి సమా వేశానికి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆనంద్, చైర్మన్ వాసం రేణుక, చింత బాలయ్య, యాకాంతం, సీఆర్‌పీ నరేష్, వెంకటరమణ, మధుకర్, రాంచంద్రయ్య, నెహ్రూ, కోటేశ్వర్‌లు పాల్గొన్నారు.

అనారోగ్యంతో సీనియర్ మాజీ విలేకరి మృతి

నవతెలంగాణ-గార్ల:

మండల కేంద్రానికి చెందిన సీనియర్ మాజీ విలేకరి యాకూబ్ జానీ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. పేద కుటుంబానికి చెందిన యాకూబ్ జాని గతంలో ఓ దినపత్రికలో మండల విలేకరి గా పని చేశారు. ఉండటానికి ఇళ్లు,ఇంటి స్థలం కూడా లేని పేద కుటుంబానికి చెందిన యాకుబ్ మృతికి పలువురు పూల మాలలతో ఘనంగా నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. మండలానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రముఖుల ఆర్థిక సహకారంతో దహన సంస్కారాలు నిర్వహించారు.

యాకూబ్ జాని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి: సీపీఐ(ఎం)

నిరుపేద కుటుంబానికి చెందిన యాకూబ్ జానీ గతంలో ఓ దినపత్రికలో విలేకరి గా పని చేసి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని యాకూబ్ జాని కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలువాల సత్యవతిలు కోరారు.

నారాయణరావుకు కాంగ్రెస్ నాయకుల పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని ఏనుగల్లులో వరంగల్ ఏఎంసీ చైర్మన్ తక్కలపెల్లి నారాయణరావు, భాస్కర్‌రావు, వరద రాజేశ్వరరావు తల్లి సుభద్రాదేవి శుక్రవారం మరణించగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జాటోతు శ్రీనివాస్ నాయక్ పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆయనతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ఆయా తండాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

